# క్రైమ్ మిర్రర్ ®
THE
Voice of Anti Corruption

హైదరాబాద్
30-9-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 190

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

## శివుడు- రాముడు!

### దేశంలో ఆధ్యాత్మిక పొలిటికల్ వార్

హిందువుల్లో చీలిక తెచ్చే ప్రయత్నం

బిజెపి సంప్రదాయ ఓటు బ్యాంకుపై కాంగ్రెస్ గురి

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** కాంగ్రెస్ హిందుత్వ ఓటు బ్యాంక్ పై ఫోకస్ పెట్టిందా? బిజెపి సంప్రదాయ ఓటు బ్యాంకులో చీలిక తేవాలని చూస్తోందా? అందులో భాగమే శివుడు, రాముడు అనే ఫార్ములా నా? గాంధీ పరివార్ వర్సెస్ సంఘ్ పరివార్ నినాదానికి ఇది కొనసాగింపా?

3లో

## వావ్ కవిత.. ఆ ఆలోచన వేరు!

ఖైరతాబాద్ విషయంలో అసలు కవిత ఆలోచన ఏంటి? ఆమె ఎందుకు ఉప ఎన్నికల్లో పోటీ చేయించాలని చూస్తున్నారు? తమ పార్టీ అభ్యర్థిని ఎందుకు రంగంలోకి దించాలని భావిస్తున్నారు? పొలిటికల్ వర్గాల్లో దీనిపైనే ఆసక్తికర చర్చ నడుస్తోంది.

“

ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో పక్కా లెక్కతోనే..

ప్రధాన మూడు పార్టీలపై గట్టి ప్రభావం

గెలవకపోయినా.. వారి గెలుపోటముల డిసైడ్ చేసేలా..

- మిగతా 2 వ పేజీలో



## అమీర్‌పేటలో దారుణం..

### ప్రియుడితో లాడ్జ్‌కు వెళ్లిన మహిళ..

తెల్లారేసరికి విగతజీవిగా.. అసలేం జరిగింది!

పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. చివరికి లాడ్జ్‌లో దారుణం

అమీర్‌పేట లాడ్జ్‌లో శిరీష అనే మహిళ అనుమానాస్పద మృతి.. హత్యగా కేసు

పెళ్లి చేసుకుంటానని నమ్మించి తీసుకొచ్చిన శ్రీనివాస్‌పై ఆరోపణలు

తెల్లవారుజామున బిల్లు కట్టి పరారైన నిందితుడు

నకిలీ ఆధార్‌లతో గది తీసుకున్నట్లు పోలీసుల గుర్తింపు

2లో

## నోరు అదుపులో పెట్టుకోండి..

### కొండా సురేఖ ఘాటు వార్నింగ్

అనుచిత వ్యాఖ్యలు చేస్తే మహిళా కార్యకర్తలతో తిప్పికొడతామని హెచ్చరిక

కొందరు నేతలు హద్దులు దాటుతున్నారంటూ కొండా సురేఖ వ్యాఖ్యలు

వరంగల్ రాజకీయాల్లో తన అనుచరులపై ఈగ వాలినా ఊరుకోబోమని స్పష్టం

కాంగ్రెస్‌లో విభేదాలు పక్కనపెట్టి పార్టీ బలోపేతానికి కలిసి పనిచేయాలని పిలుపు



2లో

# మూడింటిపై రేవంత్ గురి!

### సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ పై ఫోకస్

ముందుగా కేటీఆర్ నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ

ఆ తరువాత రెండు నియోజకవర్గాలపై

గులాబీ పార్టీ అగ్రనేతల కట్టడికి గట్టి ప్రయత్నాలు

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:**

గులాబీ పార్టీ కంచుకోటలపై రేవంత్ దృష్టి పెట్టారా? ఎలాగైనా అక్కడ కాంగ్రెస్ జెండా పాతాలని చూస్తున్నారా? అందులో భాగమే సిరిసిల్ల సభా? పొలిటికల్ వార్ కు అది ట్రైలరా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి.

2028 అసెంబ్లీ ఎన్నికల నాటికి గులాబీ పార్టీ అగ్రనేతల కంచుకోటలను బద్దలు

## వైసీపీ ఖాళీ!

టిడిపిలోకి క్యూ కడుతున్న ద్వితీయ శ్రేణి నాయకులు

విజయనగరంలో గట్టిగానే చిన్న శ్రీను ఎఫెక్ట్

వైయస్సార్ కాంగ్రెస్

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో టెన్షన్

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో**

విజయనగరంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరుసగా షాక్ లు తగులుతున్నాయి. మొన్ననే ఆ పార్టీకి చెందిన జిల్లా పరిషత్ చైర్మన్ చిన్న శ్రీను రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. బొత్స ఫ్యామిలీలో కీలక వ్యక్తిగా, రాజకీయ శక్తిగా ఎదిగారు చిన్న శ్రీను. బొత్స ఫ్యామిలీ నుంచి వేరుపడి అనూహ్యంగా తెలుగుదేశం పార్టీలో చేరారు.

- మిగతా 3వ పేజీలో



## నగరి నుంచి రోజా ఔట్!?

కొత్తగా బీసీ నేతకు బాధ్యతలు

కీలక నిర్ణయం దిశగా జగన్

2,3లో

### వంగవీటి మోహన్ రంగా చుట్టూ రాజకీయం!

ఉండ్రాజవరం లో విగ్రహ వివాదం

ఖండించిన కుమార్తె ఆశాకిరణ్

వైసీపీలోకి వస్తారని విస్తృత ప్రచారం.

## అభ్యర్థులు ఫిక్స్!







ఖైరతాబాద్ ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సిద్ధం

అధికార కాంగ్రెస్ నుంచి దానం నాగేందర్, బి ఆర్ఎస్ నుంచి తలసాని సాయి కిరణ్

బిజెపి అభ్యర్థిగా చింతల.. కవిత టిఆర్ఎస్ నుంచి సైతం..

చతుర్ముఖ పోటీ ఖాయం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యం అయ్యింది. ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో ఉన్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి దానం నాగేందర్ పోటీ చేయడం దాదాపు ఖాయంగా మారింది. గులాబీ పార్టీ నుంచి గెలిచిన ఆయన కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు.

2లో

## ఖైరతాబాద్‌లో జనసేన!

ఉప ఎన్నికల బరిలో సీనియర్ నటుడు

గట్టి ఆలోచనతో హై కమాండ్

గ్రేటర్ ఎన్నికలకు ఊపు తేవాలని వ్యూహాత్మక నిర్ణయం

## కేటీఆర్‌కు కవిత వార్నింగ్..

“నాతో పెట్టుకోవద్దు.. ఆధారాలు బయటపెడతా!”

కేటీఆర్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన కవిత

పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్న

పలు అంశాలపై ఆధారాలతో మాట్లాడతానని స్పష్టీకరణ

ఫామ్‌హౌస్‌లు, అనుమతులు, క్విడ్ ప్రో కోపై సంచలన ఆరోపణలు



3లో

## పల్లెకు పండుగే!

### రూ. 11,085 కోట్లతో మారనున్న గ్రామాల రూపురేఖలు

పల్లె పండుగ 3.0కు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

సరికొత్త రికార్డుల దిశగా ఏపీ ప్రభుత్వం

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో పల్లెల స్వరూపమే మారుతోంది. పల్లె పండుగ పేరుతో ప్రభుత్వం



# ఖైరతాబాద్‌లో జనసేన!



(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం. ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో జనసేన పోటీ తప్పదు అని తేలిపోయింది. ఆ పార్టీ అభ్యర్థిని బరిలోకి దించేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. ఇప్పటికే కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, కవిత పార్టీల మధ్య చతుర్ముఖ పోటీ ఉంటుందని భావిం చారు. ఇప్పుడు జనసేన ఎంట్రీ తో హైదరాబాద్ రాజకీయం ఒక్కసారిగా ఆసక్తికరంగా మారింది. ఇటీవల కాలం లో తెలంగాణపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది జనసేన. చాలా వేగంగా పుంజు కుంటుంది ఆ పార్టీ. ఆ పార్టీ రాష్ట్ర ప్రధా న కార్యదర్శి రామ్ తాళ్లూరి తెలంగాణ రాజకీయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేం దుకు ప్రత్యేక ప్రణాళిక రూపొం దించారు. ఈ క్రమంలో గ్రేటర్ పరిధిలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తమ మార్కు చూపించాలంటే.. ఖైరతాబాద్ ఉప ఎన్నికను పక్కగా వాడుకోవాలని జనసేన వర్గాలు భావిస్తున్నాయి.

**ఒంటరి పోరాటం..**

ఇప్పటికే ఖైరతాబాద్ లో బిజెపి పోటీ చేసేందుకు అన్ని సన్నాహాలు మొదలుపెట్టింది. పార్టీ అభ్యర్థిని ఖరారు చేసే పనిలో పడింది. అయితే ఈసారి బిజెపితో సంబంధం లేకుండా.. స్వీయ బలంతోనే ఖైరతాబాద్ లో జనసేన అభ్యర్థిని నిలబెట్టాలని హై కమాండ్ నిర్ణయించింది. పొత్తుల వైపు చూడకుండా ఒంటరిగానే బరిలోకి దిగి.. జనసేన ఓటు బ్యాంకు ఏంటో నిరూపించుకోవాలనే ఆలోచనలో ఉంది. గ్రేటర్ ఎన్నికలకు ముందు జరిగే ఈ సెమీఫైనల్ పోరులో.. ఖైరతాబాద్ లాంటి ప్రతిష్టాత్మక స్థానంలో పోటీ చేస్తే.. పార్టీ క్యాడర్లో కొత్త ఉత్సాహం రావడమే కాకుండా అది బలమైన పునాదిగా మారుతుందని భావిస్తున్నారు.

**తెరపైకి ఆ సీనియర్ నటుడు..**

ఖైరతాబాద్ నుంచి జనసేన అభ్యర్థిగా ఒక సీనియర్ నటుడు పేరును పరిశీలిస్తున్నట్లు ఫిలింనగర్ వర్గాలతో పాటు పొలిటికల్ సర్కిల్స్లో విపరీతంగా ప్రచారం జరుగుతోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు అత్యంత ఆప్తుడిగా ఉంటూ.. ప్రజల్లో మంచి గ్లామర్, ఫాలోయింగ్ ఉన్న ఒక ప్రముఖ నటుడిని ఈ సీట్ నుంచి బరిలో దింపే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. స్థానిక ఓటర్లతో పాటు యువతను, సినిమా అభిమానులను ఆకట్టుకోవడానికి ఈ గ్లామర్ కాంబినేషన్ పక్కాగా వర్కౌట్ అవుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఒకవేళ ఆ సీనియర్ నటుడు ఖైరతాబాద్ రేసులో దిగితే మాత్రం మొత్తం సమీకరణలు మారిపోతాయి. ఇప్పటివరకు చతుర్ముఖ పోటీ అనుకున్నారు. ఈ ఓట్ల చీలికతో జనసేన అభ్యర్థి గెలిచిన ఆశ్చర్యపోనవసరం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# శివుడు– రాముడు!

(మొదటి పేజీ తరువాయి)

ఈ నినాదం వెనుక భారీ వ్యూహం ఉందా? తెలంగాణ సీఎం రేవంత్ ఈ ప్రచారం మొదలు పెట్టారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తాజాగా రేవంత్ రెడ్డి ఢిల్లీలో మీడియా చర్చల్లో నిర్మొహమాటంగా ఈ విభజన ప్రచారం చేశారు. భారతీయ జనతా పార్టీ హిందుత్వ అజెండా.. ముఖ్యంగా రాముడు పేరుతో సాధిస్తున్న రాజకీయ ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా ఈ కొత్త నినాదాన్ని తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. శివుడు పేదల దేవుడని.. రాముడు ధనికుల దేవుడు అంటూ విభజించి మాట్లాడడం.. తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి వంటి నేతలు జాతీయ వేదికలపై దీనికి ప్రచారం కల్పించడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

**హిందుత్వవాదంతోనే బిజెపికి బలం..**

భారతీయ జనతా పార్టీ బలమైన హిందుత్వవాదంతో ముందుకు సాగుతోంది. మూడుసార్లు కేంద్రంలో వరుసగా అధికారంలోకి వచ్చింది. అన్ని రాష్ట్రాల్లో కూడా సర్ప చాటుతోంది. సమగ్ర హిందుత్వ ఓటు బ్యాంకును సొంతం చేసుకుంది. దానిని ఢీకొట్టడం విపక్షాలకు చాలా కష్టం. హిందూ విశ్వాసాల అంతర్గతంలోనే ఒక వర్గ పోరాటాన్ని రగిలించే ప్రయత్నం ఇది. సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల ప్రాతినిధ్యం అనే వామపక్ష, సోషలిస్ట్ సూత్రాలను నేరుగా దేవుళ్లకు ఆపాదించడం ద్వారా.. శైవ, వైష్ణవ చీలికను తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. తద్వారా రాముడి చుట్టూ బిజెపి నిర్మించిన రాజకీయ కోటను.. శివుడిని సామాన్యుడి ప్రతినిధిగా చూపిస్తూ కూల్చవచ్చునేది ఆ పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది.



**రాజకీయ మైలేజీ కోసం..**

భారతీయ సనాతన సంస్కృతిలో హరి హరుల మధ్య ఎలాంటి భేదం లేదన్నది శతాబ్దాలుగా ప్రజల నమ్మకం. శివాయ విష్ణురూపాయ.. శివరూపాయ విష్ణవ అనే ఆధ్యాత్మిక సత్యాన్ని ఇప్పుడు రాజకీయ మైలేజీ కోసం విభజించే ప్రయత్నం చేస్తుండడం స్పష్టంగా అర్థం అవుతుంది. రాజకీయ లబ్ధి కోసం భక్తుల హృదయాల్లో కొలువైన దైవాలను ధనిక, పేద వర్గాలుగా విభజించడం అనేది భారతీయ జీవన విధానంపై తీవ్రమైన అవగాహన రాహిత్యాన్ని ప్రదర్శించడమే అవుతుంది. బిజెపి హిందుత్వ రాజకీయాలను ఎదుర్కొనే క్రమంలో కాంగ్రెస్ తీసుకుంటున్న ఈ సాఫ్ట్ హిందుత్వ నినాదం ఆ పార్టీకి లాభం కంటే నష్టమే ఎక్కువ. ఎందుకంటే హిందుత్వ వాదాన్ని తెరపైకి తెస్తే ఆ పార్టీకి ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకు చెల్లాచెదురు కావడం ఖాయం. బిజెపిని దెబ్బతీయాలన్న కోణంలో కాంగ్రెస్ ఆలోచన మంచిదే. కానీ అది ప్రజల్లో విభజన రేఖ తెచ్చే అంశం కాకూడదు. అంతిమంగా అది ఆ పార్టీకే నష్టం అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# అభ్యర్థులు ఫిక్స్!




(మొదటి పేజీ తరువాయి)

ఆపై ఎమ్మెల్యే పదవికి అనర్హత వేటుపడడంతో ఈ ఉప ఎన్నిక వచ్చి పడింది. అయితే ఖైరతాబాద్ నుంచి గెలిచి తన పొట్టు నిలుపుకోవడం దానం నాగేందర్ కు రాజకీయ సమస్యగా మారింది. నియోజకవర్గంలో వ్యక్తిగత క్యాడర్, మున్సిపల్ డివిజన్లో బలమైన అనుచర గణం ఉండడం ఆయనకు సానుకూల అంశంగా మారింది. అయితే తరచూ పార్టీలు మారుతారు అన్న విమర్శలు, అధికార పార్టీ పై ఉన్న వ్యతిరేకతను అధిగమించడం ఆయనకు సవాల్గా మారనుంది.

**తలసాని దిక్కు..**

ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితికి బలమైన అభ్యర్థి లేకపోవడం లోటు. గత పది సంవత్సరాలుగా ఇక్కడ దానం నాగేందర్ పైనే పార్టీ ఆధారపడింది. అందుకే బలమైన నేత దొరకడం లేదు ఆ పార్టీకి. అందుకే వ్యూహాత్మకంగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుమారుడు తలసాని సాయికిరణ్ యాదవ్ ను బరిలోకి దింపే ఆలోచనలో ఉంది. హైదరాబాద్ నగర పరిధిలో యాదవ సామాజిక వర్గం ఉంది. ఆపై గులాబీ పార్టీకి బలమైన యంత్రాంగం ఉండడం సాయికిరణ్ కు కలిసి వచ్చే అంశం. తలసాని శ్రీనివాస్ యాదవ్ కు ఉన్న రాజకీయ అనుభవం, గ్రేటర్ పరిధిలో ఉన్న పట్టును ఉపయోగించి.. ఈ సీటును దక్కించుకోవడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని షాక్ ఇవ్వాలని గులాబీ పార్టీ శ్రేణులు ప్రణాళిక రచిస్తున్నాయి. సాయి కిరణ్ కు ఇది నగరంలో తన సొంత రాజకీయ ఉనికి చాటుకోవడానికి దొరికిన అవకాశం.

**చింతల వైపే మొగ్గు..**

ఇంకోవైపు భారతీయ జనతా పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బరిలో దిగే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో బిజెపి ఆయన వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. అయితే ఆయన వయోభారంతో ఉన్నారు. అందుకే బిజెపి మరో ఆలోచనలో ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఖైరతాబాద్ నియోజకవర్గంలో బిజెపికి సంప్రదాయ హిందూత్వ ఓటు బ్యాంకు ఉంది. వ్యాపార వర్గాల మద్దతు కూడా కలిసి వచ్చే అంశం. కంటోన్మెంట్ తో పాటు లోక్సభ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో బిజెపి సాధించిన ఓటింగ్ శాతాన్ని చూపిస్తూ.. అర్బన్ ఓటర్ల మద్దతుతో విజయం సాధించవచ్చునే ధీమాలో చింతల రామచంద్రారెడ్డి ఉన్నారు. త్రిముఖ పోరు జరిగితే ఓట్ల చీలిక తమకే కలిసి వస్తుందని భారతీయ జనతా పార్టీ అంచనా వేస్తోంది.

**కవిత పార్టీ రెడీ..**

మరోవైపు తెలంగాణ రక్షణ సేన అభ్యర్థి సైతం ఇక్కడ రంగంలో ఉంటారు. కచ్చితంగా ఖైరతాబాద్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి ఉంటారని కల్వకుంట్ల కవిత ప్రకటన చేశారు. ఆ పార్టీ తరపున అభ్యర్థి బరిలో దిగితే చతుర్ముఖ పోటీ ఖాయం. ఆ మూడు పార్టీల అభ్యర్థులకు ప్రత్యామ్నాయంగా బలమైన నేతను కవిత రంగంలోకి దించగలిగితే మాత్రం గట్టి ప్రభావం చూపే అవకాశం ఉంది. అధికార కాంగ్రెస్ పార్టీ పాలనపై అసంతృప్తిగా ఉన్న వర్గాలను.. భారత రాష్ట్ర సమితి అసంతృప్తులను తమ వైపు తిప్పుకునే అవకాశం ఇప్పుడు కవితకు దక్కింది. చూడాలి ఎటువంటి ఫలితం దక్కుతుందో.

# నగిరి నుంచి రోజా ఔట్!?



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** మాజీ మంత్రి రోజా పెద్దగా ఇప్పుడు కనిపించడం లేదు. ఆమె రాజకీయాలను విడిచిపెడతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. మధ్య మధ్యలో వైసిపి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు కానీ.. ఆమె మునుపటిలా రాజకీయాలపై అంతగా ఆసక్తి కనబరచడం లేదన్న టాక్ పొలిటికల్ వర్గాల్లో ఉంది. దానికి కారణం నగిరి నియోజకవర్గంలో ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని జగన్ ప్రోత్సహిస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. అదే జరిగితే పార్టీలో ఉండడం కంటే బయటకు వెళ్లిపోవడమే మేలన్న నిర్ణయానికి ఆమె వచ్చినట్లు తెలుస్తోంది. జగన్ రాయలసీమ పై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. అందులో భాగంగా బలమైన నియోజకవర్గాలను ఎలాగైనా కైవసం చేసుకోవాలని చూస్తున్నారు. గతం మాదిరిగా అభ్యర్థుల ఎంపిక విషయంలో ఎటువంటి మొహమాటలకు పోదలుచుకోలేదని వైసిపి వర్గాలు చెబుతున్నాయి.

**అప్పుడప్పుడు కనిపిస్తున్న రోజా..**

నగిరి నియోజకవర్గంలో కూడా అప్పుడప్పుడు కనిపిస్తున్నారు రోజా. గత ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో ద్వితీయ శ్రేణి క్యాడర్ ఎక్కువగా ఆమెను వ్యతిరేకించింది. ఆపై రోజా కూడా పెద్దగా వారిని కలుపు కెల్లలేదు. అయితే ఇలా అసంతృప్త నేతలంతా సీనియర్ నేత పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి అనుచరులు అని తెలుస్తోంది. ఒకానొక సమయంలో పెద్దిరెడ్డి మాటను సైతం రోజా పెద్దగా పట్టించుకోలేదట. అందుకే ఎన్నికల సమయంలో రోజా అభ్యర్థిత్వం విషయంలో పెద్దిరెడ్డి సైతం జగన్మోహన్ రెడ్డికి కీలక సూచనలు చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే రోజా లాంటి నేతకు టికెట్ ఇవ్వకపోతే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని భావించి జగన్ చివరి నిమిషంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**అందుకే బీసీ నేతకు..**

ప్రస్తుతం నగిరి నియోజకవర్గాన్ని ఓ బీసీ నేతకు కట్టబెట్టేందుకు తెరవెనుక మంత్రాంగం జరుగుతున్నట్లు సమాచారం. ఇప్పటికే లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో ఇన్చార్జిను మార్చారు జగన్. ఇప్పుడు నగిరి పై కూడా ఫుల్ ఫోకస్ పెట్టారు. నగిరి నుంచి గాలి భాను ప్రకాష్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన లోకేష్ తో పాటు చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు కూడా. రోజురోజుకు ఆ నియోజకవర్గంలో బలం పెంచుకుంటున్నారు. భాను ప్రకాష్ ను ఎదుర్కోవాలంటే బీసీ నేత అయితే సరిపోతారని జగన్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. రోజాను తప్పించి ఆ బీసీ నేతకు బాధ్యతలు ఇవ్వడం ఖాయమని సమాచారం.

**పార్టీ కార్యక్రమాలకే పరిమితం..**

మరోవైపు రోజా ను పార్టీ కార్యక్రమాలకే పరిమితం చేస్తారని వైసీపీ వర్గాల్లో ఒక ప్రచారం ఉంది. అయితే ఆమె మాత్రం ఎమ్మెల్యే పదవితో పాటు మంత్రి పదవి చూశారు గనుక.. ఎట్టి పరిస్థితుల్లో తానే పోటీ చేస్తానని అధిష్టానానికి తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఆమెకు వైసిపి తప్ప మరో ఛాన్స్ లేదు. వైసీపీ టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్గా పోటీ చేసే అవకాశం కూడా లేదు. అందుకే మళ్లీ గ్లామర్ ఫీల్డ్ వైపు వెళ్లిపోవాలన్న ఆలోచనలో ఆమె ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఆమె పార్టీ కార్యక్రమాలకు సైతం దూరమై.. సినిమాలతో పాటు టీవీ షోలకు పరిమితం అవుతున్నారని ప్రచారం సాగుతోంది. అందులో ఎంతవరకు అవకాశం ఉందో చూడాలి.

# వావ్ కవిత.. ఆ ఆలోచన వేరు!

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:దానం నాగేందర్ వ్యవహారంతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక వచ్చింది. అయితే ఈ ఎన్నికల్లో తాను తమ పార్టీ అభ్యర్థిని రంగంలోకి దించుతానని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితా ప్రకటించారు. అయితే ఆమె పార్టీ అభ్యర్థి ఎంతవరకు ప్రభావం చూపుతారు అనేది పక్కన పెడితే.. ఇతర పార్టీల గెలుపు ఓటములను ప్రభావితం చేస్తారని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. ఎందుకంటే అక్కడ త్రిముఖ పోటీ ఖాయం. ప్రధానంగా కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ ల మధ్య గట్టి పోటీ ఉంటుంది. నాలుగో శక్తిగా సరికొత్త వేదికతో ప్రత్యక్ష ఎన్నికల్లోకి దూకడం ద్వారా తన పార్టీ ఉనికి చాటుకునేలా చేస్తున్నారు కవిత. ఏదైనా రాజకీయ ప్రకంపనలు.. తన పార్టీ ద్వారా తెరలేపి ఆలోచన చేస్తున్నారు.

**పార్టీ నిర్మాణం జరగకుండానే..**

కవిత పార్టీ ఏర్పాటు జరిగి నెలలు గడుస్తోంది. ఇంకా పార్టీ ద్వితీయ శ్రేణి నిర్మాణం జరగలేదు. ఇటువంటి సమయంలో ఉప ఎన్నిక అనేది ఆ పార్టీకి గొప్ప సాహసం. అయినా సరే ఈ ఎన్నికల్లో తన పార్టీ అభ్యర్థిని కవిత దింపుతున్నారు అంటే భారీ వ్యూహమే ఉంటుంది. ఆమె అజెండా రాష్ట్ర రాజకీయాల్లో తమకంటూ ఒక ప్రత్యేక ఓటు బ్యాంకు ఉందని నిరూపి ంచుకోవడమే అని స్పష్టమవుతోంది. కొత్తగా పెట్టిన పార్టీకి క్షేత్రస్థాయిలో ఉనికిని చాటాలన్న.. భవిష్యత్తు ఎన్నికల నాటికి కేడర్ను సమాయత్తం చేయాలన్నా.. ఇలాంటి బైపాస్ సరైన మైదానాలు. కేవలం ప్రెస్ మీట్లకు పరిమితం కాకుండా.. స్వయంగా రోడ్లెక్కి ప్రచారం చేసి గౌరవప్రదమైన సంఖ్యలో ఓట్లు రాబెట్టుకోగలిగితే.. తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో ఒక అనివార్యమైన ప్రత్యామ్నాయ శక్తిగా నిలబడవచ్చు అనేది కవిత ఆలోచన. అందుకే ఈ ఉప ఎన్నికను ఆమె ఏదో మొక్కుబడిగా కాకుండా.. సీరియస్ అంశంగా తీసుకుని ముందుకు సాగుతున్నారు.

**అనేక సమీకరణలు..**

తెలంగాణలోనే అతిపెద్ద నియోజకవర్గం ఖైరతాబాద్. అక్కడ భౌగోళిక, రాజకీయ సమీకరణలు భిన్నంగా ఉంటాయి. అందుకే అక్కడ పోటీ మరింత రసవత్తరంగా మారే అవకాశాలు ఉన్నాయి. నియోజకవర్గంలో బస్తీలు, మధ్యతరగతి కాలనీలు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ క్రమంలో స్థానికంగా పట్టుండి, వ్యక్తిగత పరపతి కలిగిన బలమైన అభ్యర్థిని బరిలోదించగలిగితే ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ప్రత్యేకించి మహిళా ఓటర్ల పై కవిత ప్రభావం ఎక్కువ. దానికి కారణం తెలంగాణ జాగృతి. మహిళా సాధికారిక అంశాలను ఆమె సమర్థవంతంగా ప్రచారంలోకి తీసుకెళ ్లగలిగితే.. మహిళల ఓటు బ్యాంకును కొంతవరకు సొంతం చేసుకోవచ్చు. పైగా నగర మహిళలు కొంచెం అడ్వాన్స్ గా ఆలోచిస్తారు. తమ ప్రయోజనాలకు పెద్ద పీట వేసే వారికి ఛాన్స్ ఇస్తారు. అందుకే కవిత పార్టీ అభ్యర్థి మహిళా ఓటు బ్యాంకు పై ప్రభావం చూపగలరు. మిగతా ప్రధాన పార్టీల ఓటు బ్యాంకును గండి కొట్టగలరు.

**వారి ఆశలు తలకిందులు..**

కవిత ఎంట్రీ తో ఖైరతాబాద్ లో రాజకీయ సమీకరణలు మారే అవకాశం ఉంది. ప్రధాన పార్టీల గెలుపు ఓటముల మార్జిన్లు తలకిందులయ్యే అవకాశం కూడా ఉంది. సాంప్రదాయకంగా ఉన్న గులాబీ పార్టీ ఓట్లతో పాటు అధికార కాంగ్రెస్ వైఫల్యాలపై అసంతృప్తితో ఉన్న తటస్థ ఓట్లపై కవిత ప్రభావం చూపగలిగితే మాత్రం.. ఆ పార్టీకి గౌరవప్రదమైన ఓట్లు లభించే అవకాశం ఉంది. ప్రధాన పార్టీల జయాపజయాలను శాసించగలిగితే మాత్రం తెలంగాణ సమాజంలో కవిత పార్టీ కోసం ఆలోచన మొదలయ్యే ఛాన్స్ ఉంటుంది. అదే తక్కువ ఓట్లు లభించినా మంచి పోరాట పటిమ ప్రదర్శిస్తున్నారు అన్న పేరు సొంతం చేసుకోవచ్చు. ఎలా వెళ్లిన కవితకు ఈ ప్రయోగం లాభం చేకూర్చేదే.

# నోరు అదుపులో పెట్టుకోండి..



వరంగల్, సెప్టెంబర్ 29:వరంగల్ రాజకీయాల్లో కొండా సురేఖ వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. తనను, తన అనుచరులను ఉద్దేశించి కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై ఆమె తీవ్రంగా స్పందించారు. హద్దులు దాటి మాట్లాడితే తగిన రీతిలో సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా మహిళా కార్యకర్తల సత్తా ఏమిటో ప్రత్యర్థులకు చూపిస్తామని ఘాటైన వ్యాఖ్యలు చేశారు.దమంగళవారం వరంగల్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన కొండా సురేఖ.. కొందరు నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇకపై అలాంటి వ్యాఖ్యలను సహించేది లేదని స్పష్టం చేశారు. తన అనుచరులను లక్ష్యంగా చేసుకుని మాట్లాడేవారు నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. "ఇష్టానుసారం మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తాం. ఒక్కో మహిళ నలుగురిని కొడుతుంది"అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. ప్రత్యర్థులు గాలిలో కత్తులు తిప్పుతున్నారని, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని మాట్లాడాలని ఆమె వ్యాఖ్యానించారు. ఇవి కొండా సురేఖ చేసిన రాజకీయ వ్యాఖ్యలేనని స్పష్టంగా చూడాలి.

**అనుచరుల విషయంలో వెనక్కి తగ్గేది లేదంటూ..**

తన అనుచరుల విషయంలో ఎలాంటి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోననే సంకేతాలను సురేఖ ఇచ్చారు. తమపై లేదా తమ వర్గంపై విమర్శలు చేసే నేతలు హద్దులు దాటితే రాజకీయంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. వరంగల్‌లో కొండా కుటుంబానికి ఉన్న అనుచర బలం నేపథ్యంలో ఆమె తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇటీవల కూడా తన అనుచరులపై ఈగ వాలినా ఊరుకోబోమని ఆమె వ్యాఖ్యానించినట్లు స్థానిక మీడియా నివేదికలు వెల్లడించాయి. మరోవైపు, కాంగ్రెస్‌లోని అంతర్గత విభేదాలపైనా కొండా సురేఖ స్పందించారు. నాయకులు వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని సూచించారు. అందరూ ఐక్యంగా ఉంటేనే కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయగలమని ఆమె పేర్కొన్నారు.

# మూడింటిపై రేవంత్ గురి!

కొట్టాలన్న ఆలోచనలు సీఎం రేవంత్ ఉన్నారు. సిరిసిల్లతో మొదలుపెట్టి సిద్ధిపేట, గజ్వేల్ వైపు దండయాత్ర కొనసాగించాలని నిర్ణయించుకున్నారు రేవంత్. ముందుగా కేటీఆర్ కోటలో రాజకీయ రణభేరి నిర్వహించి స్ట్రాంగ్ వార్నింగ్ ఇవ్వనున్నారు.

**రేవంత్ పై వ్యక్తిగత ఫోకస్..**

గత కొంతకాలంగా చూస్తే కాంగ్రెస్ వర్సెస్ గులాబీ పార్టీ అనేకంటే.. రేవంత్ వర్సెస్ కేటీఆర్, హరీష్ రావు అన్నట్టు పరిస్థితి ఉంది. ఎలాగైనా రాజకీయంగా రేవంత్ ను దెబ్బతీయాలని గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు ఆ ఇద్దరు నేతలు. అయితే అదే దూకుడుతో ఉన్నారు సీఎం రేవంత్. సెప్టెంబర్ 30న సిరిసిల్లలో నిర్వహించనున్న సభ ద్వారా కేటీఆర్ పై విరుచుకుపడనున్నారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో భారీ సభ నిర్వహించడం వెనుక.. కేవలం అభివృద్ధి కార్యక్రమాల అజెండా లేదు. పొలిటికల్ అజెండా ఉన్నట్లు స్పష్టమవుతోంది. నాలుగు కిలోమీటర్ల రోడ్డు షో, భారీ బహిరంగ సభ, మంత్రులు, కాంగ్రెస్ ముఖ్య నేతల మోహరింపుతో సిరిసిల్లను కాంగ్రెస్ రాజకీయ శక్తి ప్రదర్శనకు వేదికగా మార్చే ప్రయత్నం గా కనిపిస్తోంది.

**ఇమేజ్ ను డామేజ్ చేసే ప్రయత్నం..**

సిరిసిల్లలో కేటీఆర్ పొలిటికల్ ఇమేజ్ను దెబ్బతీసేందుకే రేవంత్ ప్రయత్నం అని విశ్లేషకులు భావిస్తున్నారు. 2009,2014, 2018 2023, ఎన్నికల్లో



వరుసగా గెలుస్తూ వస్తున్నారు కేటీఆర్. ఇక్కడ భారీ బహిరంగ సభ నిర్వహించి సక్సెస్ చేయడం ద్వారా.. వచ్చే ఎన్నికల్లో కేటీఆర్ కు కష్టమే అన్న సంకేతాలు పంపించాలని రేవంత్ భావిస్తున్నారు. ఇది కేవలం కేటీఆర్ తో రాజకీయ పోరుగా కాకుండా.. భారత రాష్ట్ర సమితి క్యాడర్ లో ఉన్న రాజకీయ ఆధిక్య భావనను దెబ్బతీయాలన్న వ్యూహంగా కనిపిస్తోంది. సిరిసిల్ల సభకు వచ్చే జనస్పందన, కాంగ్రెస్ శ్రేణుల సమీకరణ, స్థానిక నాయకత్వం పనితీరు.. ఇవన్నీ రాబోయే రాజకీయ వ్యూహాలకు ఒక పరీక్ష గా మారనున్నాయి.

**ఆ రెండు చోట్ల సైతం..**

అయితే ఒక్క సిరిసిల్ల మాత్రమే కాదు. సిద్దిపేట తో పాటు గజ్వేల్ పైన దృష్టి పెట్టే అవకాశం ఉంది. హరీష్ రావు తో పాటు కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో వరుసగా సభలు, సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడం మాత్రమే కాదు.. గులాబీ పార్టీ అగ్రనేతల అవినీతి పాలనను కూడా తెలియజెప్పేందుకు ఈ సభలను రేవంత్ ఒక వేదికగా మార్చుకునే అవకాశం ఉంది. రాజకీయంగా వారిని దెబ్బతీసి.. మరోసారి తెలంగాణలో అధికారం చేజిక్కించుకునేందుకు ఒక వ్యూహంగా కనిపిస్తోంది. 30న సిరిసిల్లలో సభ పూర్తవగానే సిద్దిపేట తో పాటు గజ్వేల్ లో సైతం సభల నిర్వహణకు సంబంధించి ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

**పక్కా రాజకీయ వ్యూహం**

పక్కా పొలిటికల్ వ్యూహంతోనే ఈ మూడు నియోజకవర్గాలపై కాంగ్రెస్ దృష్టి పెట్టింది. ముగ్గురు అగ్ర నేతలను సొంత నియోజకవర్గాలకు పరిమితం చేసి.. చేతులు కట్టేయాలన్నది ప్లాన్. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా మిగతా నియోజకవర్గాలకు పెద్దగా సమయం కేటాయించలేరు కాబట్టి.. పక్కా ప్రణాళికతో రేవంత్ రెడ్డి ఈ వ్యూహానికి తెర తీసినట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని గమనించిన కేటీఆర్ కూడా ఎదురుదాడికి దిగారు. సిరిసిల్ల సభకు ముందుగానే నియోజకవర్గ సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని నిలదీశారు. మొత్తానికైతే 2028 ఎన్నికలకు సంబంధించి పొలిటికల్ వార్ ముందే మొదలైంది.



**సీడబ్ల్యూసీ సమావేశానికి ముందు.. రేవంత్, డీకే శివకుమార్ లతో రాహుల్ ముచ్చట్లు**

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి ముందు, ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయ ప్రాంగణంలో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ లతో కొద్దిసేపు ముచ్చటించారు. సీడబ్ల్యూసీ సమావేశానికి ముందు వారు నిలుచుని ముచ్చటించుకుంటున్నట్లుగా ఉన్న ఫోటోను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్నారు. ఈ సంభాషణలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, శివకుమార్‌తో పాటు కేసీ వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు. కాగా, సీడబ్ల్యూసీ సమావేశంలో పలు జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చించినట్లు రేవంత్ రెడ్డి తన పోస్టులో పేర్కొన్నారు. దేశ భవిష్యత్తుకు సంబంధించిన సామాజిక, ఆర్థిక వ్యూహాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు.

# వంగవీటి మోహన్ రంగా చుట్టూ రాజకీయం!

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ రాజకీయాల్లో వంగవీటి మోహన్రంగా అది ప్రత్యేక స్థానం. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఆయన పేరు వినిపిస్తూనే ఉంటుంది. ఆయన పేరు చెప్పి కాపు సామాజిక వర్గం ఓటర్లను తమ వైపునకు తిప్పుకునే రాజకీయం నడుస్తూనే ఉంటుంది. అయితే తాజాగా ఎన్నికలకు ఇంకా మూడేళ్ల ముందు వంగవీటి మోహన్ రంగ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.



గోదావరి జిల్లాలో వంగవీటి మోహన్ రంగ విగ్రహం చుట్టూ ఇప్పుడు రాజకీయం ప్రారంభం అయింది. ఉండ్రాజవరంలో ఏర్పాటుచేసిన రంగా విగ్రహం విషయంలో తలెత్తిన వివాదం రాజకీయ రంగు పులుముకుంటోంది. ప్రస్తుతం కూటమి వైపు కాపు సామాజిక వర్గం ఉంది. అయితే ఇప్పుడు రంగా విగ్రహానికి సంబంధించి అన్యాయం జరుగుతోంది అంటూ వైసీపీ ఆరోపించడం ప్రారంభించింది. సోషల్ మీడియాలో సైతం దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది ఆ పార్టీ. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో ఉన్నారు వంగవీటి మోహన్రంగా కుమారుడు రాధాకృష్ణ. మరోవైపు ఆయన కుమార్తె ఆశాకిరణ్ యాక్టివయ్యారు. పొలిటికల్ ఎంట్రీ కి సిద్ధంగా ఉన్నారు. రంగా రాధా మిత్రమండలి బలోపేతంపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో ఉండ్రాజవరంలో జరిగిన విగ్రహ వివాదం పై ఆశా కిరణ్ ఘాటుగా స్పందించారు. త్వరలో తమ ప్రభుత్వం వస్తుంది అంటూ ఆవేశంగా వ్యాఖ్యానించారు. అయితే ఆమె ఉద్దేశాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. త్వరలో ఆశా కిరణ్ వైసీపీలోకి వస్తారని... అందులో భాగంగానే ఈ వ్యాఖ్య చేశారంటూ చెబుతోంది. వంగవీటి ఆశకిరణ్ యాక్టివ్ అయినప్పుడు కూడా వైసిపి ఇదే తరహా ప్రచారానికి తెరలేపింది. ఆమె వైసీపీలోకి వచ్చేస్తున్నారంటూ రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేసింది. సోషల్ మీడియా హోరెత్తింది. అయితే తాను ఏ పార్టీలో చేరలేదని.. రాజకీయంగా ఒక నిర్ణయం తీసుకుంటే కచ్చితంగా ప్రత్యేక ప్రకటన చేస్తానని ఆమె చెప్పుకొచ్చారు. దీంతో ఆ ప్రచారానికి చెక్ పడింది. అయితే ఇప్పుడు ఉండ్రాజవరం విగ్రహ వివాదం నేపథ్యంలో ఆశా కిరణ్ చుట్టూ రాజకీయం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి. అయితే ఆమె కుటుంబం టిడిపిలో ఉండడంతో ఎట్టి పరిస్థితుల్లో ఆ పని చేయరని వంగవీటి అభిమానులు చెబుతున్నారు.

# కేటీఆర్‌కు కవిత వార్నింగ్..

కవిత ఘాటుగా స్పందించారు. పార్టీ వైఫల్యాలకు అధినేత కేసీఆర్‌ను బాధ్యుడిని చేస్తూ మాట్లాడటం సరికాదని ఆమె విమర్శించారు. అంతేకాదు.. తనతో పెట్టుకోవద్దని, తాను మాట్లాడే ప్రతి అంశానికి నిర్దిష్టమైన ఆధారాలు ఉన్నాయని హెచ్చరించారు. కవిత చేసిన ఈ వ్యాఖ్యలు మంగళవారం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

**కేటీఆర్ వ్యాఖ్యలపై కవిత ఫైర్**

ఎమ్మెల్యేలకు నియోజకవర్గాల్లో స్వేచ్ఛ ఇవ్వడం, అక్కడి వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం వంటి అంశాలపై కేటీఆర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను కవిత ప్రస్తావించారు. కేసీఆర్ “నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం” అనే విధంగా చెప్పడం వల్లే కొన్ని సమస్యలు తన వరకు రాలేదన్న కేటీఆర్ వ్యాఖ్యలపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీలో జరిగిన వైఫల్యాలకు, నాయకత్వ నిర్ణయాలకు కేసీఆర్‌ను నిందించడం ద్వారా బీఆర్‌ఎస్‌కే నష్టం జరుగుతోందని కవిత ఆరోపించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్టుగా వ్యవహరించొద్దని కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

**“నేను ఆధారాలు లేకుండా మాట్లాడను”**

తాను బీఆర్‌ఎస్‌లో ఉన్న సమయంలో ఒక వ్యక్తిపై విమర్శలు చేసినందుకు పార్టీ నుంచి సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అలాంటప్పుడు ఇప్పుడు పార్టీ అధినేత కేసీఆర్‌నే బహిరంగంగా తప్పుబడుతూ వ్యాఖ్యలు చేయడం ఏ విధంగా సమర్థించుకుంటారని ప్రశ్నించారు. ఇదే సందర్భంలో తాను ఎవరినీ కేవలం మాటలు విని విమర్శించనని కవిత స్పష్టం చేశారు. తన వద్ద ఉన్న సమాచారాన్ని, ఆధారాలను బట్టి మాత్రమే మాట్లాడతానని చెప్పారు. తనతో రాజకీయంగా తలపడే ముందు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని కేటీఆర్‌ను హెచ్చరించారు.

**ఫామ్‌హౌస్‌లు, అనుమతులపై ఆరోపణలు**

కేటీఆర్‌పై కవిత పలు ఆరోపణలు కూడా చేశారు. ఫామ్‌హౌస్‌లు, అనుమతుల వ్యవహారాలు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొందరితో ఉన్న సంబంధాలు, క్విడ్ ప్రో కో వంటి అంశాలను ప్రస్తావించారు. వీటి కారణంగానే బీఆర్‌ఎస్‌కు నష్టం జరిగిందని ఆమె ఆరోపించారు. అయితే ఈ అంశాల్లో కవిత చేసినవి రాజకీయ ఆరోపణలు మాత్రమే. వాటిని నిర్ధారించే స్వతంత్ర ఆధారాలు లేదా అధికారిక దర్యాప్తు ఫలితాలను ఈ తాజా వ్యాఖ్యల్లో ఆమె పూర్తిగా వెల్లడించలేదు. అందువల్ల ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా కాకుండా కవిత వాదనలుగా చూడాల్సి ఉంటుంది.

**మహిళలపై వ్యాఖ్యల ప్రస్తావన**

ఇటీవల పార్టీ కార్యక్రమంలో ఒక రైతు ఫోన్‌లో మాట్లాడుతున్న సందర్భంలో ఆయన భార్య గురించి కేటీఆర్ అనుచితంగా మాట్లాడారని కూడా కవిత ఆరోపించారు. అలాగే సాయం కోరుతూ వచ్చిన ఓ మహిళతోనూ సరిగా వ్యవహరించలేదని ఆమె విమర్శించారు. మరోవైపు గణేశ్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను సంప్రదించిన తీరుపైనా కవిత వ్యాఖ్యలు చేశారు. ఈ అంశాల్లోనూ ఆమె కేటీఆర్‌పై నేరుగా విమర్శలు గుప్పించారు.

# వైసీపీ ఖాళీ!

ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాలనే కుదిపేసాయి. అయితే చిన్న శ్రీనును పట్టించుకోవాల్సిన అవసరం లేదని.. ఆయనతో ఏ ఒక్క వైసీపీ నేత వెళ్ళరు అంటూ చెప్పుకొచ్చారు వైయస్సార్ కాంగ్రెస్ అగ్ర నేతలు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి క్యాడర్ అంతా విజయనగరంలో ఖాళీ అవుతుండడం ఇప్పుడు ఆందోళన కలిగించే విషయం.

**ద్వితీయ శ్రేణి నాయకత్వం లో మార్పు..**

ఏ పార్టీకైనా ద్వితీయ శ్రేణి నాయకత్వమే ముఖ్యం. వారు పటిష్టంగా ఉంటేనే ఆ పార్టీ అధికారంలోకి రాగలదు. అయితే ఇప్పుడు విజయనగరం జిల్లాలో ఏకంగా మాజీ జడ్పీటిసిలు వైసీపీకి గుడ్ బై చెబుతున్నారు. చిన్న శ్రీను నేతృత్వంలో తెలుగుదేశం పార్టీకి జై కొడుతున్నారు. వాస్తవానికి 2021 స్థానిక



సంస్థల ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయనగరం జిల్లాలో ప్రభంజనం సృష్టించింది. ఏకపక్షంగా అన్ని మండలాల జడ్పీటిసి స్థానాలతో పాటు జిల్లా పరిషత్ పీఠాన్ని కైవసం చేసుకుంది. అయితే ఇప్పుడు ఆ మాజీ జడ్పీటిసి లంతా మూకుమ్మడిగా తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇది కోలుకోలేని దెబ్బ.

**చిన్న శ్రీను కీలకం..**

బొత్స రాష్ట్ర నాయకుడిగా ఎదగడం వెనుక కుటుంబ పాత్ర ఉంది. ప్రధానంగా ఆయన మేనల్లుడు చిన్న శ్రీను పాత్ర విశేషం. క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ను, పార్టీని ఒంటి చేత్తో నడిపించారు. అందుకే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. మరోవైపు చిన్న శ్రీను సైతం టిడిపిలో స్వేచ్ఛగా పనిచేయగలుగుతున్నారు. మొత్తం వైసీపీ క్యాడర్ను టిడిపి వైపు ఒక క్రమ పద్ధతిలో తిప్పుతున్నారు. ఇది ఎంత మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వానికి మింగుడు పడని విషయం. అయితే మున్ముందు మరిన్ని పరిణామాలు విజయనగరం జిల్లాలో చోటు చేసుకునే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో.. గతంలో తెలుగుదేశం పార్టీకి ఎదురైన పరిణామాలే.. ఇప్పుడు వైసీపీకి ఎదురు కావడం ఖాయమని విశ్లేషణలు వస్తున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో..



# పల్లెకు పండుగే!

(మొదటి పేజీ తరువాయి)

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోంది. భారీగా నిధులు మంజూరు చేస్తోంది. దీనికి ముమ్మాటికి ఆద్యుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా తన మార్కు చూపిస్తున్నారు. నిధుల కేటాయింపులు, పారదర్శక పాలన, స్వర్ణ పంచాయితీ పోర్టల్ వంటి విప్లవాత్మక సంస్కరణలతో.. పల్లె అభివృద్ధికి జీవం పోస్తున్నారు. పట్టు వదలని విక్రమార్కుడిలా ఆ శాఖలో పనులు వేగవంతం చేసి.. గతంలో ఎన్నడూ లేని విధంగా.. 13218 పంచాయితీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించి.. ప్రపంచ రికార్డులు సృష్టించడం పవన్ కళ్యాణ్ కే సాధ్యం అయింది.

**రెండు విడతలతో మారిన ఏపీ..:** ఇప్పటికే పల్లె పండుగ పేరుతో రెండు విడతల అభివృద్ధి పనులు జరిగాయి. ఇప్పుడు పల్లె పండుగ 3.0 తో మరో మైలురాయి దిశగా అడుగులు వేస్తున్నారు. పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పంచాయితీ రాజ్ శాఖ చేపట్టిన అపూర్వమైన చర్యలతో.. రాష్ట్రవ్యాప్తంగా గుంతల మయమైన రహదారులకు మహర్దశ పడుతోంది. ఉపాధి హామీ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ.. గత రెండు పల్లె పండుగల్లో వేలాది కిలోమీటర్ల సిసి, బీటీ రోడ్లు, మినీ గో కులాలు, ఇతర మౌలిక వసతులను రికార్డు సమయంలో పూర్తి చేశారు పవన్ కళ్యాణ్. గ్రామీణ ప్రాంత ప్రజల రవాణా కష్టాలను తీర్చడమే లక్ష్యంగా.. ప్రాధాన్యత క్రమంలో అన్ని ప్రధాన రహదారులను సురక్షితంగా మార్చేందుకు పవన్ కళ్యాణ్ ప్రణాళిక బద్ధంగా అడుగులు వేశారు.

**మూడో విడతకు శ్రీకారం..:** పల్లె పండుగ తొలి రెండు విడతలను విజయవంతంగా పూర్తి చేసింది ఏపీ ప్రభుత్వం. ఈరోజు మూడో విడత మొదలు పెట్టనుంది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మక పల్లె పండుగ 3.0 కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. రూ. 11,085 కోట్ల భారీ నిధులతో గ్రామీణ రూపురేఖలను మార్చేలా డిజైన్ చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా.. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల విప్లవానికి తెర లేపారు. గ్రామీణ పేదరికం నిర్మూలనతో పాటు మౌలిక వసతుల కల్పనలో పంచాయితీ రాజ్ శాఖ శరవేగంగా నిర్ణయాలు తీసుకోవడం పవన్ విజన్ కు అద్దం పడుతోంది.

**సమూల మార్పులు..:** పల్లె పండుగ 3.0 ద్వారా పవన్ కళ్యాణ్ నేతృత్వంలోనే పంచాయితీ రాజ్ శాఖ.. ఏకంగా 15,500 కిలోమీటర్ల మేర రవాణా సౌకర్యాలను విస్తరించనుంది. ఇందులో రూ.7,550 కోట్లతో 9500 కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులు, రూ.2,700 కోట్లతో 6000 కిలోమీటర్ల సిసి రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నారు. వీటితోపాటు పాడి రైతుల కోసం రూ. 300 ఓట్లతో 22 వేల మినీ గో కులాలు, రూ. 225 కోట్లతో ఉద్యాన పంటల పెంపకం, రూ. 110 కోట్లతో మ్యాజిక్ డ్రైన్లు, రూ. 200 కోట్లతో పంచాయితీ భవనాలు, బస్సు షెల్టర్ల నిర్మాణం చేపడుతున్నారు.

# అమీర్‌పేటలో దారుణం..

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్, సెప్టెంబర్ 29:పెళ్లి చేసుకుంటానని నమ్మించిన వ్యక్తితో కలిసి లాడ్జ్‌కు వెళ్లిన ఓ మహిళ.. కొద్ది గంటల్లోనే విగతజీవిగా మారింది. ఉదయం గది తలుపులు తెరుచుకోకపోవడంతో సిబ్బందికి అనుమానం వచ్చింది. పోలీసులకు సమాచారం ఇవ్వగా.. తలుపులు తెరిచి చూడటంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ అమీర్‌పేటలోని ఓయో లాడ్జ్‌లో జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా ధారూర్ మండలానికి చెందిన బేగరి శిరీష (34) నగరంలోని ఓ కస్టమర్ కేర్ సెంటర్‌లో పనిచేస్తోంది. ఆమెకు 2016లో విడాకులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. అదే జిల్లాకు చెందిన తాండూరు మండలం అవుసలపల్లికి చెందిన శ్రీనివాస్ (38)తో ఆమెకు గతంలోనే పరిచయం ఉంది. తనను పెళ్లి చేసుకుంటానని శ్రీనివాస్ చాలాకాలంగా చెబుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

**రాత్రి ఏం జరిగింది?**

ఈ నెల 24న రాత్రి శిరీష, శ్రీనివాస్ ఇద్దరూ అమీర్‌పేటలోని గోకుల్ ప్రైడ్ ఓయో లాడ్జ్‌కు వెళ్లారు. గదిని అద్దెకు తీసుకునే సమయంలో ఇద్దరూ వేర్వేరు పేర్లతో ఉన్న ఆధార్ కార్డులు సమర్పించినట్లు పోలీసులు గుర్తించారు. గణేశ్, దుర్గ పేర్లతో నకిలీ ఆధార్ కార్డులు ఉపయోగించి మొదటి అంతస్తులోని 103వ గదిలో బస చేసినట్లు దర్యాప్తులో తేలినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 28వ తేదీ రాత్రి ఇద్దరి మధ్య పెళ్లి విషయమై గొడవ జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ సమయంలో శ్రీనివాస్ శిరీషపై దాడి చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. శిరీష మృతిచెందిన విషయం బయటపడకుండా శ్రీనివాస్ తెల్లవారుజామునే లాడ్జ్ నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు చెబుతున్నారు. మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో రిసెప్షన్‌కు వచ్చిన అతడు బిల్లు చెల్లించాడు. అనంతరం శిరీష ఉదయం 9 గంటలకు గది ఖాళీ చేస్తుందని సిబ్బందికి చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అయితే ఉదయం సమయం దాటినా గది తలుపులు తెరవకపోవడంతో లాడ్జ్ సిబ్బందికి అనుమానం వచ్చింది. పలుమార్లు తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు.

# సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందంజలో రామ్‌దేవ్‌రావు హాస్పిటల్

**ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా వాకథాన్, ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరం.. దాదాపు 406 మందికి ఉచిత సేవలు**





**కూకట్ పల్లి, సెప్టెంబర్ 29 (క్రైమ్ మిర్రర్) :** ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ ఆధ్వర్యంలో వాకథాన్, ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరం నిర్వహించారు. హృదయ సంబంధిత వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడం, ముందస్తు వైద్య పరీక్షల ప్రాధాన్యాన్ని తెలియజేయడం ఈ కార్యక్రమాల లక్ష్యమని హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ కార్యక్రమంలో భాగంగా, కుముదినీదేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్, లయన్స్ క్లబ్ ఆఫ్ సనాతన సహకారంతో వాకథాన్ నిర్వహించారు. ప్రముఖ రేకీ థెరపీ గ్రాండ్ మాస్టర్, రచయిత్రి, ఫ్యామిలీ కౌన్సిలర్, సామాజిక కార్యకర్త లక్ష్మీ కమలాకర్ పచ్చజెండా ఊపి వాకథాన్‌ను ప్రారంభించారు. నిత్యం వ్యాయామం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా హృదయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. వాకథాన్‌లో గైనకాలజిస్టులు డా. చాయాదేవి, డా. ప్రమోదిని, డా. మంజుల, డా. సుమన్ లత; కార్డియాలజిస్టులు డా. ప్రదీప్ రెడ్డి, డా. శ్రీకాంత్; రేడియాలజిస్టులు డా. లోకేష్ రెడ్డి, డా. మౌనిక, ఈఆర్ ఫిజీషియన్లు డా. స్వాతి రెడ్డి, డా. సుమ, డా. వీరభద్ర; పాథాలజిస్టులు డా. పావని, డా. చందన పాల్గొన్నారు. వీరితో పాటు డా. సుధారాణి (అనస్థీషియా), డా. డి. నాగేంద్ర (పల్మనాలజిస్ట్), డా. రోహిత్ నాయక్ (న్యూరో సర్జన్), డ్యూటీ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, ఇతర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.వాకథాన్ అనంతరం వైద్యులు గుండె జబ్బుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుకోవాలని సూచించారు. రామ్‌దేవ్‌రావు హాస్పిటల్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరంలో బీపీ, జీఆర్‌బీఎస్ (రక్తంలో చక్కెర), ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలతో పాటు కార్డియాలజీ వైద్యుల సంప్రదింపులను అందించారు. శిబిరానికి విశేష స్పందన లభించగా, మొత్తం 406 మంది ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. రామ్‌దేవ్‌రావు హాస్పిట ల్ మేనేజ్‌మెంట్ మార్గదర్శకత్వంలో, డా. కమలాకర్, డా. ప్రదీప్ రెడ్డి, డా. యోబు ఆధ్వర్యంలో కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. సహకరించిన వైద్యులు, హాస్పిటల్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, లయన్స్ క్లబ్ సభ్యులు, పాల్గొన్న ప్రజలందరికీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ఆరోగ్యం -- మా బాధ్యత" అనే స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందంజలో ఉంటామని, భవిష్యత్తులోనూ ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలను కొనసాగిస్తామని హాస్పిటల్ యాజమాన్యం పేర్కొంది.



## శంకర్‌పల్లి పోలీసుల అత్యుత్సాహం - ప్రెస్ వాహనాలకు కూడా చలాన్లు

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్‌పల్లి పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని జర్నలిస్టుల నుండి తీవ్ర విమర్శలు వస్తున్నాయి.రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ పోలీసులు, బండిపైన స్పష్టంగా ( ప్రెస్ )అని రాసి ఉన్నా కూడా పట్టించుకోకుండా ఇష్టానుసారంగా చలాన్లు వేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.వార్తల సేకరణ కోసం, ప్రజా సమస్యలను తెలుసుకోవడం కోసం రోడ్డుపై తిరుగుతున్న పాత్రికేయుల వాహనాలను ఆపి, కనీసం ఐడీ కార్డు కూడా చూడకుండా ఫోటోలు తీసి చలాన్లు వేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.ప్రెస్ అని ఉంటేనే నిబంధనల ప్రకారం మినహాయింపు ఇవ్వాలి, కానీ శంకర్‌పల్లి పోలీసులు మాత్రం కావాలనే టార్గెట్ పెట్టుకుని చలాన్లు వేస్తున్నారు. ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమే" అని స్థానిక జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి, ప్రెస్ వాహనాల పట్ల ఇలా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, అక్రమ చలాన్లను వెంటనే రద్దు చేయాలని శంకర్ పల్లి జర్నలిస్టుల సంఘం డిమాండ్ చేస్తోంది.

## బ్రాహ్మణపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అలకుంట్ల సుధాకర్ అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పూల పెద్దిరాజు పంచాయతీ కార్యదర్శి చిలక. సోఫియా, వార్డు సభ్యులు గవ్వల శారద, మారోజు నర్సింహాచారి, అట్ల రంజిత్, వట్టిపల్లి యాకమ్మ, చుక్కల లింగయ్య, బాకీ శ్రావణి, పాయిలి బాలరాజు, మరియు రేషన్ డీలర్ రాపోలు సరస్వతి గ్రామ శాఖ అధ్యక్షులు మారోజు యాదగిరి, మెడ రామచంద్రు, ముత్యం సోమయ్య, గ్రామ ప్రజలు వట్టిపల్లి రాజయ్య, వెంకటేష్,అంజయ్య, రామచంద్రయ్య అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## రచ్చబండ నిర్మాణానికి 1 లక్ష 10వేలు ఆర్థిక సహాయం అందజేసిన మల్లారెడ్డి

**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని గోపరాజుపల్లి గ్రామంలో రచ్చబండ నిర్మాణానికి నల్ల మల్లారెడ్డి ఒక లక్ష పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రచ్చబండ అనేది తెలంగాణ పల్లెల్లో కనిపించే ఒక సాంప్రదాయక వేదిక ఇది ప్రాచీన కాలం నుండి గ్రామీణ జీవనంలో ప్రధాన భాగంగా ఉంటూ వస్తున్నాయి. ఇది కేవలం విశ్రాంతి స్థలం మాత్రమే కాకుండా బహుళ ప్రయోజన కారిగా ఉపయోగపడుతుంది. గ్రామస్తులు ఉదయం సాయంత్రం వేళల్లో కలుసుకొని కష్టసుఖాలు వ్యవసాయ పనులు పంటలు వివరాలు మాట్లాడే కేంద్రం పండుగ సమయాలు సాంస్కృతిక వేదిక అని అన్నారు. రాజకీయాలను చర్చించడానికి రచ్చబండ ఒక సమాచార కేంద్రంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సలిగంజి పృథ్వి, గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు ,తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం జిల్లాలో నూతన నాయకత్వాన్ని తయారు చేస్తూ యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తున్నాం

**యువజన కాంగ్రెస్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వేజండ్ల సాయికుమార్ వెల్లడి**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** యువజన కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తూ, నూతన యువ నాయకత్వాన్ని తయారు చేయడానికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజండ్ల సాయి కుమార్ తెలిపారు. యువజన కాంగ్రెస్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో భాగంగా ఖమ్మం జిల్లాలో గత ఆరు నెలలుగా నిర్వహించిన కార్యకలాపాల నివేదికను యువజన కాంగ్రెస్ జాతీయ ఇన్‌చార్జ్ మనీష్ శర్మ మరియు తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో వేజెండ్ల సాయికుమార్ సమర్పించారు. ఈ సందర్భంగా వేజండ్ల సాయి మాట్లాడుతూ, గత ఆరు నెలల్లో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఖమ్మం జిల్లాలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అదే విధంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రజలతో కలిసి పనిచేశామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కూడా యువజన కాంగ్రెస్ కార్యకర్తలు చురుకుగా పనిచేస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రామస్థాయి నుంచి యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి, ప్రతి గ్రామంలో యువతను భాగస్వాములను చేస్తూ నూతన నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని సాయికుమార్ వెల్లడించారు. ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై సమర్పించిన నివేదికను పరిశీలించిన యువజన కాంగ్రెస్ జాతీయ ఇన్‌చార్జ్ మనీష్ శర్మ మరియు తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి వేజండ్ల సాయి ను అభినందించారు

# ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.3 లక్షల ఆర్థిక భరోస



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 29 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పించేందుకు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ కృషి చేశారు. బాలానగర్ డివిజన్‌కు చెందిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సోను తండ్రి మహమ్మద్ మక్బూల్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బండి రమేష్, ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరయ్యేలా చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో తోడ్పాటును అందిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయ కత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యతను ఇస్తూ ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న ఆర్థిక సాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ప్రజలకు ఏ ఆపద వచ్చినా అండగా నిలవడమే ప్రజాప్రతినిధుల బాధ్యతగా భావిస్తున్నామని బండి రమేష్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్థిక సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు చేరేలా నిరంతరం అందుబా టులో ఉంటానని తెలిపారు. వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వ సహకారం అందించడం ద్వారా వారికి కొంతమేర ఉపశమనం కలుగుతుందని అన్నారు. రూ.3 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ఓసీ చెక్కు అందడంతో బాధిత కుటుంబ సభ్యులు బండి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎజాజ్, రంగారావు, శివ, రమణ, నరేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.



# మహావీర్ నగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ లైన్ అభివృద్ధి పనులకు శ్రీకారం

**పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 29 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహావీర్‌నగర్, గణేష్‌నగర్, ఖాజానగర్ ప్రాంతాల్లో తరచూ జరుగుతున్న సీవర్ ఓవర్‌ఫ్లో సమస్యకు పరిష్కారంగా "300 ఎంఎం దయా సీవర్ లైన్" ఏర్పాటు పనులకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కాలనీవాసులు, స్థానిక నాయకులతో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ పనులకు సంబంధించిన "శిలాఫలకం" ప్రకారం, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై & సీవరేజ్ బోర్డు ఆధ్వర్యంలో ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నారు.మహావీర్ నగర్ కాలనీలో నిర్వహించే శంకుస్థాపన (ఇనాగ్రేషన్) కార్యక్రమానికి ముఖ్యఅతిథి "శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్" ఆర్కేపూడి గాంధీ తో కలిసి "ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్" దొడ్ల వెంకటేష్ గౌడ్, "హైదర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్" నార్నె శ్రీనివాస రావు, డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్, చంద్రకాంత్, ఎరగండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు దీర్ఘకాలంగా ఇబ్బందిగా మారిన సీవరేజ్ ఓవర్‌ఫ్లో, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా సీవర్ లైన్ ఏర్పాటు పనులు చేపట్టడం, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కలిపించడంలో భాగంగా ఈ పనులు పూర్తయితే, మహావీర్ నగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చేపట్టే దిశగా ఈ అభివృద్ధి పనులతో స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనం కలగనుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు, మహిళానాయకులు, కాలనీవాసులు, యువకులు, టీం పట్వారీ తదితరులు భారీగా పాల్గొన్నారు.

## క్యాతనపల్లి పురపాలక సంఘంలో

# కమిషనర్ వర్సెస్ పాలకవర్గం

### మురళీకృష్ణ బదిలీకి పాలకవర్గం తీర్మానం.. ఏకగ్రీవ ఆమోదం

### కౌన్సిల్ సమావేశానికి తగిన ఎజెండా లేదంటూ కాంగ్రెస్ కౌన్సిలర్ల బహిష్కరణ





**రామకృష్ణాపూర్ సెప్టెంబర్ 29 (క్రైమ్ మిర్రర్):** క్యాతనపల్లి మున్సిపాలిటీలో కమిషనర్ ఎన్. మురళీకృష్ణ, పాలకవర్గం మధ్య విభేదాలు ముదిరాయి. చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్, కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని పాలకవర్గం ఆరోపించింది. కౌన్సిల్ సమావేశానికి తగిన ఎజెండా లేదని అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించారు. కమిషనర్ మురళీకృష్ణను బదిలీ చేయాలని కోరుతూ మున్సిపల్ పాలకవర్గం తీర్మానం ప్రవేశపెట్టగా.. ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశం నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు.

**ఎజెండాపై అభ్యంతరం**

సమావేశం అనంతరం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ డాక్టర్ గోడిసెల సంధ్యారాణి మాట్లాడుతూ. చైర్మన్,వైస్ చైర్మన్ లను సంప్రదించకుండానే కౌన్సిల్ సమావేశ ఎజెండాను రూపొందించారని ఆరోపించారు. ఇలా ఏకపక్షంగా రూపొందించిన ఎజెండాను ఆమోదించేది లేదని స్పష్టం చేశారు. కమిషనర్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రజాప్రతినిధులకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని అన్నారు.

**అవినీతి ఆరోపణలు.. నోటీసులపై అభ్యంతరం**

కమిషనర్‌పై అవినీతి ఆరోపణలు ఉన్నాయని చైర్‌పర్సన్ ఆరోపించారు. భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపడుతున్న యజమానులకు సైతం నోటీసులు ఇస్తూ.. ఇళ్లు కూల్చివేస్తామని భయాందోళనకు గురిచేస్తున్నారని అన్నారు. గత రెండు నెలల్లో కౌన్సిల్ దృష్టికి తీసుకురాకుండా సుమారు 200 నుంచి 230 మంది ఇంటి యజమానులకు నోటీసులు ఇచ్చారని తెలిపారు.గద్దెరాగడి, సూపర్‌బజార్ ప్రాంతాల్లో ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే దుకాణాలను కూల్చివేశారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు.

**పారిశుధ్యంపై అసంతృప్తి**

పట్టణంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని సంధ్యారాణి అన్నారు. పలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయిందని, వినాయక మండపాల వద్ద కూడా తగిన పారిశుధ్య పనులు చేపట్టలేదని విమర్శించారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్షలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా అధికారులు పట్టించుకోలే దన్నారుగణేష్ మండపాల నిర్వాహకులే చందాలు వేసుకుని పారిశుధ్య పనులు చేసుకోవాలని చెప్పడం సరికాదన్నారు. బతుకమ్మ పండుగ నాటికి పరిస్థితి మారకపోతే ప్రజాప్రతినిధులే వీధుల్లోకి వచ్చి చీపుర్లు పట్టుకుని శుభ్రం చేయాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు.

**సింగరేణి భూముల పేరుతో సేవలు నిలిపివేయొద్దు**

మున్సిపాలిటీ పరిధిలో అధికశాతం సింగరేణి భూములే ఉన్నాయనే కారణంతో సాధారణ పారిశుధ్య సేవలను నిలిపివేయడం సరికాదని చైర్‌పర్సన్ అన్నారు. 22 వార్డుల్లో పారిశుధ్య పనులను సమానంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. సింగరేణి అధికారులు కమర్షియల్ భవనాలకు సంబంధించి చెప్పిన విషయాలను కమిషనర్ వేరే విధంగా చూపిస్తున్నారని ఆరోపించారు.

**చెట్ల కేటాయింపుపై అభ్యంతరం**

కౌన్సిల్ అనుమతి లేకుండా మున్సిపల్ నర్సరీలోని చెట్లను ప్రైవేట్ వ్యక్తులు, జాతీయ రహదారి కాంట్రాక్టర్లకు కేటాయించారని సంధ్యారాణి ఆరోపించారు. మున్సిపాలిటీకి చెందిన బ్లేడ్ ట్రాక్టర్లను వినియోగించకుండా ప్రైవేట్ వాహనాలను అద్దెకు తీసుకోవడంపైనా ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.

**బదిలీకి తీర్మానం**

కమిషనర్ మురళీకృష్ణను బదిలీ చేయాలని కోరుతూ మున్సిపల్ పాలకవర్గం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించే బాధ్యతాయుతమైన అధికారిని నియమించాలని ప్రభుత్వం, ఉన్నతాధికారులను చైర్‌పర్సన్ కోరారు.



## ఆరోపణలు నిరూపిస్తే శాఖాపరమైన చర్యలకు సిద్ధం

### బిల్డింగ్ పర్మిషన్లపై అసత్య ప్రచారాలు నమ్మొద్దు: కమిషనర్ మురళీకృష్ణ

### అనుమతులన్నీ ఆన్‌లైన్‌లోనే.. దళారులను నమ్మి మోసపోవద్దని సూచన

**రామకృష్ణాపూర్, సెప్టెంబరు 29 (క్రైమ్ మిర్రర్):** క్యాతనపల్లి పురపాలక సంఘంలో బిల్డింగ్ పర్మిషన్ల పేరుతో తన పేరు ఉపయోగించి కొందరు చేస్తున్న ప్రచారాలు, ఆరోపణలతో తనకు ఎలాంటి సంబంధం లేదని మున్సిపల్ కమిషనర్ ఎన్. మురళీకృష్ణ స్పష్టం చేశారు. భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ నిబంధనల ప్రకారమే జరుగుతుందని తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలకు ఆధారాలు చూపించాలని.. అవి నిజమని నిరూపితమైతే శాఖాపరమైన చర్యలకు సిద్ధమని స్పష్టం చేశారు.

**ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు:** బిల్డింగ్ పర్మిషన్ల కోసం దళారులను సంప్రదించాల్సిన అవసరం లేదని కమిషనర్ తెలిపారు. మున్సిపల్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవసరమైన పత్రాలు, వివరాలను ఆన్‌లైన్‌లోనే సమర్పించాలని చెప్పారు. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసిన 21 రోజుల్లో అనుమతి మంజూరు లేదా తిరస్కరణ జరుగుతుందని వివరించారు.

**లోపాలు ఉంటే సరిచేసుకోవాలి:** దరఖాస్తుల్లో పత్రాలకు సంబంధించిన లోపాలుంటే వాటిని సరిచేసుకోవాలని సూచిస్తామని తెలిపారు. అన్ని సాంకేతిక అంశాలను పరిశీలించిన అనంతరమే అనుమతులు మంజూరు చేస్తామని చెప్పారు. సందేహాలు, సమస్యలు ఉంటే టౌన్ ప్లానింగ్ అధికారులు, ఎల్‌టీపీని నేరుగా సంప్రదించాలని సూచించారు.

**డబ్బులు వసూలు చేస్తే బాధ్యత లేదు:** తన పేరు చెప్పి ఎవరైనా ప్రైవేటు వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తే దానికి మున్సిపల్ అధికారులకు ఎలాంటి సంబంధం లేదని కమిషనర్ స్పష్టం చేశారు. మధ్యవర్తులు, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. బిల్డింగ్ పర్మిషన్ల కోసం అధికారిక ఆన్‌లైన్ విధానాన్నే వినియోగించుకోవాలని కోరారు.

## జహీరాబాద్‌లో ఉద్రిక్తత.. శేఖర్ మృతిపై బంధువుల ఆందోళన

### పోలీసుల వేధింపులే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆరోపణలు

### జాతీయ రహదారిపై బైఠాయింపు..

### మద్దతుగా ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు





**జహీరాబాద్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, సెప్టెంబర్ 29:** బీఆర్ఎస్ కార్యకర్త శేఖర్ మృతితో జహీరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం బిలాల్‌పూర్‌కు చెందిన శేఖర్ మృతికి పోలీసుల వేధింపులే కారణమని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. పోలీసుల దెబ్బలు, వేధింపులు తాళలేకే శేఖర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని వారు పేర్కొన్నారు. శేఖర్ మృతితో బిలాల్‌పూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.ఘటనకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, పోలీసులపై వచ్చిన ఆరోపణలను పూర్తిగా పరిశీలించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. బాధ్యులుగా తేలిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ డిమాండ్‌తో శేఖర్ కుటుంబ సభ్యులు, బంధువులు జహీరాబాద్ జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆ ఆందోళనకు మద్దతుగా ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు లు పాల్గొన్నారు. దీంతో జాతీయ రహదారిపై ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీ కార్యకర్తలను, పోలీసులను అడ్డం పెట్టుకుని తెలంగాణలో భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు అతిగా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. శేఖర్ మృతిపై సమగ్ర విచారణ జరిపి, కుటుంబానికి న్యాయం చేయాలని ఎమ్మెల్యేలు, కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దింతో పోలీసులు ఆందోళన కారులను శాంతిప చేశారు.

## అక్టోబర్ 2న జర్నలిస్టుల హక్కుల కోసం నిరసనలు

### టీయూడబ్ల్యూజే--ఐజేయూ వనపర్తి జిల్లా అధ్యక్షుడు డి. మాధవరావు



**వనపర్తి సెప్టెంబర్ 28 క్రైమ్ మిర్రర్:** జర్నలిస్టుల హక్కులు, భద్రత, సామాజిక–ఆర్థిక సంక్షేమం కోసం ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) పిలుపు మేరకు అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా 'డిమాండ్ల దినోత్సవం' నిర్వహించనున్నట్లు టీయూడబ్ల్యూజే--ఐజేయూ వనపర్తి జిల్లా అధ్యక్షుడు డి. మాధవరావు తెలిపారు. మంగళవారం జిల్లా కార్యదర్శి బి.రాజు ఆధ్వర్యంలో వనపర్తి కలెక్టర్ సముదాయ భవనం లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడారు.తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో గాంధీ విగ్రహాల వద్ద జర్నలిస్టులు నిరసన కార్యక్రమాలు చేపట్టి, అనంతరం కలెక్టర్లు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేయాలని ఆయన కోరారు. వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమంలో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.మీడియా రంగంలో చోటుచేసుకున్న మార్పులకు అనుగుణంగా నూతన మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక జాతీయ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు గతంలో చట్టబద్ధంగా కల్పించిన ఉద్యోగ భద్రత, సేవా నిబంధనలు, వేతనాలు, ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించిన హక్కులను పునరుద్ధరించాలని కోరారు. జర్నలిస్టులు, జర్నలిస్టేతర మీడియా సిబ్బందికి ప్రస్తుత జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలు కల్పించేందుకు కొత్త వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని, ఉద్యోగులకు అందిస్తున్న తరహాలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇచ్చి నగదు రహిత వైద్య చికిత్స సౌకర్యం కల్పించాలని కోరారు.వనపర్తి జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఆరోగ్య సదుపాయాలు కల్పించడంతో పాటు అక్రిడిటేషన్, గుర్తింపు కార్డులు, విధి నిర్వహణకు అవసరమైన సౌకర్యాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని మాధవరావు కోరారు. అక్టోబర్ 2న జరిగే నిరసనలో జర్నలిస్టులు, ప్రెస్‌క్లబ్‌లు, పౌర సమాజ ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పత్రిక సమావేశంలో జిల్లా కార్యదర్శి బి రాజు, ఉపాధ్యక్షుడు కమల్ రెహమాన్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి నరసింహ రాజు, పట్టణ అధ్యక్షుడు తైలం అరుణ్ రాజ్, యూనియన్ సభ్యులు ముంత రవి, జియా,ముక్తార్, పి ఆర్ టి వి చంద్రమౌళి, నరేష్, నజీర్, చాంద్ పాషా,బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595


## చిమ్మిర్యాల గ్రామంలో 3 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కెవి సబ్ స్టేషన్ ప్రారంభించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం





**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపూరశీ:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూరశీ మండలం చిమ్మిర్యాల గ్రామంలో 3 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కెవి సబ్ స్టేషన్ కు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తో కలిసి ప్రారంభించిన మునుగోడు శాసనసభ్యులు కోమట 'రెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి . అనంతరం కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతులను కాపాడుకోవాల్సిన బాధ్యత మన పైన ఉంది. ఈ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు లేవు కేవలం వర్షాధార పంటలే ఉమ్మడి నల్గొండ జిల్లాలో మునుగోడు నియోజకవర్గమే అత్యంత వెనుకబడిన ప్రాంతం శివన్న గూడెం రిజర్వాయర్ లోకి నీరు ఎక్కడినుంచి తీసుకురావాలనేది గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం డిసైడ్ చేయలేకపోయింది. ఏదుల రిజర్వాయర్ నుండి శివన్నగూడెం రిజర్వాయర్ కు నీరు తీసుకొస్తున్నాం ఈ సంవత్సరం కరువు పరిస్థితులు ఉన్నాయి. వచ్చే సమ్మర్ వరకు త్రాగునీటికి కూడా కటకటా ఏర్పడే పరిస్థితి ఉంది. వాటిని అధిగమించడానికి ఇప్పటినుండి అప్రమత్తంగా ఉండాలి.కరెంటు సప్లై లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి. నారాయణపూర్ మండలం పుట్టపాక వద్ద 132కెవి సబ్‌స్టేషన్ తొందరలోనే రాబోతుంది. నాంపల్లి మండలంలో మరొక 132 కెవి సబ్ స్టేషన్ తొందర్లోనే రాబోతుంది. కరెంటు సమస్యలు తలెత్తకుండా ఎక్కువ సబ్‌స్టేషన్లు మంజూరు చేయించి నిర్మించుకుంటున్నాం. నియోజకవర్గంలో కరెంటు సమస్యల పరిష్కారానికి, నూతన సబ్ స్టేషన్ల మంజూరు, నూతన ట్రాన్స్ఫార్మర్లు ఎప్పటికప్పుడు తీసుకురావడానికి విద్యుత్ శాఖలో అనుభవం ఉన్న రిటైర్ అయిన వ్యక్తిని ప్రత్యేకంగా నియమించాను. ఎల్ నినో ప్రభావం వల్ల హైడల్ పవర్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది.ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలను అందరూ అర్థం చేసుకోవాలి కరెంటు సమస్యలపై ప్రతిరోజు ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న రైతులకు ఇబ్బందులు కలగకుండా కాపాడుకుంటాము. ఈ కార్యక్రమంలో చిమిర్యాల గ్రామ సర్పంచ్ ఉప్పల రమేష్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, మాజీ సర్పంచ్ దోనూరి జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, వివిధ గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల హక్కులను కాలరాస్తే సహించేది లేదు

**ఎస్ఐఆర్ ప్రక్రియపై అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే మాధవరం ఆగ్రహం**

**పేదల ఓట్ల తొలగింపే లక్ష్యంగా వ్యవహరించవద్దు**

**ఆధార్, రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకోవాలి**






**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 29 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ నత్తనడకన సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం, ఇష్టారాజ్యపు వ్యవహారశైలితో పేద ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడితే సహించేది లేదని హెచ్చరించారు. నిజమైన ఓటర్లను గుర్తించి, వారి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త రెడ్డి సతీష్ అరోరాతో పాటు మాజీ కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, సతీష్ గౌడ్, శ్రవణ్ కుమార్, బాబూరావు, సబిహా గౌసుద్దీన్, మందడి శ్రీనివాసరావు, మాధవరం రంగారావు తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో ఎస్ఐఆర్ ప్రక్రియ సందర్భంగా ఓటర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను అధికారులకు వివరించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశం నుంచి వెళ్లిపోవడంపై ఎమ్మెల్యే అసహనం ఓటర్ల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన ఎస్ఐఆర్ సమావేశం కొనసాగుతుండగా, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వద్ద మరో సమావేశం ఉందంటూ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మధ్యలోనే వెళ్లిపోవడంపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు సంబంధించిన కీలక సమస్యలపై జరుగుతున్న సమావేశానికి అధికారులు పూర్తి సమయం కేటాయించి, సమస్యల పరిష్కారానికి బాధ్యత తీసుకోవాలని అన్నారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న ఇతర సర్కిళ్ల ఉప కమిషనర్లు ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలపై సమాధానాలు ఇచ్చారు. ఓటర్ల నమోదు, సర్వేకు సంబంధించిన సమస్యలు ఉన్నవారు నేరుగా అధికారుల వద్దకు వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజలు అందించే ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు.



## కూకట్‌పల్లి, బోయిన్‌పల్లిలో 2.1 కిలోల గంజాయి పట్టివేత

**ఇద్దరు నిందితుల అరెస్టు.. బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగింత**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 29 (క్రైమ్ మిర్రర్) :** గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి నుంచి మొత్తం 2.1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ అధికారి ఆర్. ప్రవీణ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కుత్బుల్లాపూర్ పరిధిలోని కూకట్‌పల్లి ధనలక్ష్మి సెంటర్ వద్ద ఎక్సైజ్ శాఖకు చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో గుంటూరుకు చెందిన దీవి క్రాంతి అనే వ్యక్తి వద్ద 105 గ్రాముల గంజాయిని అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చావని అధికారులు విచారించగా, బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన ప్రవీణ్ కుమార్ తనకు గంజాయి ఇచ్చినట్లు క్రాంతి వెల్లడించినట్లు సమాచారం. దీంతో అధికారులు బోయిన్‌పల్లిలోని ప్రవీణ్ కుమార్ ఇంటిపై దాడి చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అతని ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మరో రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో రెండు చోట్ల కలిపి మొత్తం 2.1 కిలోల గంజాయిని అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి దీవి క్రాంతి, ప్రవీణ్ కుమార్‌లపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు నిందితులను తదుపరి చర్యల నిమిత్తం బాలానగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ అధికారి ఆర్. ప్రవీణ్ వెల్లడించారు.

## వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి

**ఐడీఎల్ ప్రవేశద్వారం వద్ద కల్వర్టు నిర్మాణ పనులు.. నేటి నుంచి మరోవైపు పనులు ప్రారంభం**



**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 29 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి ఐడీఎల్ రంగధాముని చెరువు రోడ్డు మీదుగా రైన్‌బో విస్టా, కైతలాపూర్, మాదాపూర్, హైటెక్ సిటీ ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ తిమ్మప్ప విజ్ఞప్తి చేశారు. ఇదే మార్గంలో తిరుగు ప్రయాణం చేసే వాహనదారులు సైతం ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఐడీఎల్ ప్రవేశద్వారం సమీపంలో బాక్స్ తరహా కల్వర్టు నిర్మాణ పనుల్లో భాగంగా ఒకవైపు పనులు పూర్తయ్యాయని, మరోవైపు నిర్మాణ పనులు మిగిలి ఉన్నాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. గణేశ్ నిమజ్జన కార్యక్రమాలు ముగియడంతో మిగిలిన నిర్మాణ పనులను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులు జరిగే ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున వాహనదారులు ట్రాఫిక్ సూచిక బోర్డులను గమనిస్తూ, వాటికి అనుగుణంగా ప్రయాణించాలని పోలీసులు సూచించారు. తొందరపాటు, నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోకుండా వేగాన్ని నియంత్రించుకోవాలని కోరారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, పోలీసులకు సహకరించాలని కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.

## 36వ అఖిలభారత రైతు సంఘం మహాసభలు జయప్రదం చేయండి

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** వీర తెలంగాణ పోరాట పురిటి గడ్డపై నల్లగొండలో జరిగే అఖిలభారత 36వ రైతు సంఘం మహాసభలు నవంబర్ 15 నుండి 18 వరకు జయప్రదం చేయాలని ఈరోజు నాంపల్లి మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రచారంలో భాగంగా సిపిఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి మండల కమిటీ సభ్యులు కొమ్ము లక్ష్మయ్య, కామిశెట్టి యాదయ్య, కామిశెట్టి శ్రీకాంత్, కోటిరెడ్డి, మోహన్ రెడ్డి, చల్లమల అశోక్ రెడ్డి, వి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## క్రీడల నుంచి వైద్యం వరకు.. నిర్మల జగ్గారెడ్డి వరుస కార్యక్రమాలు!

**అంబేద్కర్ స్టేడియంలో క్రీడాకారులకు బహుమతుల ప్రదానం**

**ప్రైడ్ ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాల ఆవిష్కరణ**





**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 29:** మాజీ డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి మంగళవారం సంగారెడ్డి పట్టణంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన నేషనల్ లెవల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్ ఎంపిక ప్రక్రియను పరిశీలించి క్రీడాకారులను అభినందించారు. జిల్లాకు చెందిన సుమారు 600 మంది క్రీడాకారులు ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారు. నవంబర్ 14, 16 తేదీల్లో వోక్సెన్‌లో జరగనున్న పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సోహైల్ అలీ, కార్యదర్శి జావిద్ అలీ, రవి, పీఈటీలు, పీడీలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంగారెడ్డి పట్టణంలోని ప్రైడ్ హాస్పిటల్‌లో నూతన వైద్య పరికరాలను నిర్మల జగ్గారెడ్డి ప్రారంభించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఉపయోగపడే మెకానికల్ సీపీఆర్ పరికరంతో పాటు గుండెలోని రక్తనాళాల్లో వాల్వ్ బ్లాకేజీ పరిమాణాన్ని గుర్తించేందుకు ఉపయోగించే ఆధునిక పరికరాన్ని ఆవిష్కరించారు. ఆధునిక వైద్య సాంకేతికత అందుబాటులోకి రావడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వేగంగా, మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్ మాథ్యూస్, డాక్టర్ అనిల్, ప్రవీణ్, కూన వేణు తదితరులు పాల్గొన్నారు.



## పటాన్‌చెరులో ఘనంగా ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు

**లాంఛనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**క్రీడలు, క్రీడాకారులకు సంపూర్ణ సహకారం: ఎమ్మెల్యే జీఎంఆర్**



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 29: విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించే అవకాశాలు లభిస్తాయని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పటాన్‌చెరు మండల స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు ఉచిత శిక్షణతో పాటు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో జాతీయ స్థాయి క్రీడా పోటీలకు సైతం పటాన్‌చెరు ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ క్రీడోత్సవాలకు సంపూర్ణ సహకారం అందిస్తూ అవసరమైన అన్ని వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు ప్రతిభను ప్రదర్శించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, కుమార్ గౌడ్, శివారెడ్డి, వెంకటేష్, అశోక్, శంకర్, రాజు, రాజన్ సింగ్, వివిధ పాఠశాలల క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నాంపల్లి లో నూతన క్యూఆర్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి**

**నాంపల్లి తహశీల్దార్ అంబటి ఆంజనేయులు**



**క్రైమ్ మిర్రర్,నాంపల్లి :** మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయ లో మంగళవారం స్థానిక తహశీల్దార్ అంబటి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఇటీవల మంజూరైన నూతన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ది దారులకు పంపిణీ చేశారు. నూతన క్యూఆర్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు ప్రజా ప్రతినిధులు హాజరై పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు చేశారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం డిజిటల్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఈ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఏటీఎం కార్డు సైజులో ఉన్న ఈ కొత్త కార్డులలో క్యూఆర్ కోడ్ ద్వారా లబ్ధిదారుల పూర్తి వివరాలు, రేషన్ సరుకుల పంపిణీ వివరాలు సులభంగా తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతోనే ఈ ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు ఆర్ఐలు, పౌరసరఫరాల శాఖ అధికారులు, జిపిఓ లు స్థానిక నాయకులు, పెద్దలు అధిక సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మోదీ సేవా ప్రస్థానం స్ఫూర్తిదాయకం



క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాల సేవలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా చౌటుప్పల్ మండలం పెద్దకొండూరు శివారులోని సాయి యాదాద్రి సేవా ఆశ్రమంలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నల్గొండ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి చినుకని మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన వితరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా జక్కలి రాజు యాదవ్ మాట్లాడుతూ, నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానం దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజాసేవకు అంకితమై దేశ అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. మోదీ సేవా ప్రస్థానాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా పేదలు, నిరుపేదలు, అవసరంలో ఉన్నవారికి అండగా నిలిచేలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్నదానం వంటి కార్యక్రమాలు మానవతా విలువలను చాటిచెబుతాయని, సేవా భావాన్ని మరింతగా విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జక్కలి రాజు యాదవ్ కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచర్ల గోవర్ధన్ రెడ్డి, బీజేపీ పార్టీ మండల, మున్సిపల్ అధ్యక్షులు కైరంకొండ అశోక్, కడారి కల్పన ఐలయ్య యాదవ్, ఓబీసీ మోర్చా పట్టణ, మండల అధ్యక్షులు చీకురి సాయిరాం, నాతి సురేష్, మాజీ సర్పంచ్ బాతరాజు సత్యం, పార్టీ ప్రధాన కార్యదర్శి యాస అశోక్ రెడ్డి, బీజేవైఎం నాయకులు దిండు భాస్కర్, ఉపసర్పంచ్ బోయ సదానందం, వార్డు సభ్యులు సప్పిడి లింగారెడ్డి, గుండెపురం ప్రతిభ నరేష్, తెలుకుంట్ల శ్రీధర్, రేఖ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకతీతంగా గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టాలి

**గ్రామ నక్షబాటలను సర్వే చేయండి.**

**పార్టీలు పక్కనపెట్టి ప్రజా సమస్యలపై చర్చించండి.**

**సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**





**కేశంపేట,(క్రైమ్ మిర్రర్):** గ్రామాలలో సర్పంచులు, ఉప సర్పంచ్లు వార్డు మెంబర్లు రాజకీయాలను పక్కన పెట్టి ఒకరిని ఒకరు గౌరవించుకొని గ్రామాల అభివృద్ధి పై దృష్టి సారించాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మంగళవారం కేశంపేట మండల కేంద్రం లో మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.సర్వసభ్య సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొని గ్రామాల సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాలలో విద్యుత్ సమస్య తీవ్రతరమైతుందని అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద పనులు చేపట్టిన ఇప్పటివరకు నిధులు రాలేదని ఎమ్మెల్యే గారి చోరువుతో నిధులు మంజూరు అయ్యేలా కృషి చేయాలని సర్పంచులు కోరారు.గ్రామాలలో నక్షబాటలను కబ్జాకు గురికాబడుతున్నాయని రైతులు తమ పొలాలకు పోవడానికి ఇబ్బందికరంగా ఉందని వెంటనే రెవెన్యూ అధికారులు నక్షబాటలను పునరుద్ధరించాలని ఎమ్మెల్యేకు సర్పంచులు విజ్ఞప్తి చేశారు. అలాగే షాద్ నగర్,ఆమనగల్, కొత్తపేట, కడ్తాల్ బస్సులను పునరుద్ధరించాలన్నారు.గ్రామాలలో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు,బీటీ రోడ్లను మంజూరు చేయాలని ఆయా గ్రామ సమస్యలను సర్పంచులు సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.గ్రామాలలో పార్టీలకతీతంగా ప్రతి ఒక్క నాయకుడు గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి నడుం బిగించాలన్నారు.ప్రతి నాయకుడు గ్రామం మనది సమస్య మనది అనే భావన కలిగి ఉంటేనే గ్రామాభివృద్ధి జరుగుతుందని కాబట్టి సమిష్టి కృషితో గ్రామాభివృద్ధి చేసుకోవాల న్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సర్పంచులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పంచాయతీరాజ్ చట్టాన్ని సవరణ చేస్తుందన్నారు.గత కొన్ని సంవత్సరాలుగా గ్రామాలలో నక్షబాటలను కబ్జాకు గురికాబడుతున్నాయని వాటికి శాశ్వత పరిష్కారాన్ని చూపేందుకు తహసిల్దార్ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి నక్ష బాటలు కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నక్ష బాటను కబ్జా చేసిన కబ్జాకోరులకు వెంటనే తెలంగాణ ల్యాండ్ ఎన్క్రోచ్మెంట్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.ఎలినోవా ప్రభావం వల్ల వర్ష భావం తగ్గి నీటి కొరత కరెంటు సమస్యలు వస్తున్నాయని అందుకే రైతులకు ప్రజలకు ఇబ్బంది అవుతుందన్నారు.ఎలినోవా పై అధికారులు ప్రజలకు సర్పంచులకు నాయకులకు అవగాహన కల్పించాలన్నారు.ప్రతి అధికారి ప్రజల కొరకు పని చేయాలని లేనియెడల వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.మండలంలో ఏడు డబల్ బిటి రోడ్లు మంజూరయ్యా అని అతి త్వరలోనే పనులు చేపడుతామన్నారు.విడతల వారిగా గ్రామాల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.అనంతరం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మండల పరిధిలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు అందజేశారు.ఆయా కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి,మండల ప్రత్యేక అధికారి ఏడిఏ రమాదేవి, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, తహసిల్దార్ రాజేందర్ రెడ్డి, మాజి జడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్,ఆయా గ్రామాల సర్పంచులు,ఆయా శాఖల అధికారులు నాయకులు, వీరేశం, జగదీశ్వర్, కరుణాకర్ రెడ్డి, పాల్గొన్నారు.



## గుండె ఆరోగ్యంపై అవగాహనకు 4 కిమీ వాకథాన్

**మెడికవర్ చందానగర్ ఆధ్వర్యంలో "వాక్ ఫర్ ఎ హెల్తియర్ హార్ట్"**



**పటాన్చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 29:** ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి చందానగర్ ఆధ్వర్యంలో "వాక్ ఫర్ ఎ హెల్తియర్ హార్ట్" పేరుతో 4 కిలోమీటర్ల అవగాహన వాకథాన్ నిర్వహించారు. బీరంగూడ కమాన్ నుంచి లింగంపల్లి బీహెచ్ఈఎల్ చౌరస్తా వరకు ఉదయం 6.30 గంటలకు వాకథాన్ కొనసాగింది. హృదయ ఆరోగ్యం, గుండె జబ్బుల నివారణ, అత్యవసర సమయాల్లో సీపీఆర్ ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్యకరమైన గుండె కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సమావేశంలో కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులు డా. భారవి చుండూరి, డా. శ్రవణ్ కుమార్ వి. మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమం తప్పకుండా వ్యాయామం, సమతుల ఆహారం, రక్తపోటు, మధుమేహ నియంత్రణతో గుండె సంబంధిత సమస్యలను తగ్గించుకోవచ్చని వివరించారు. యువతలోనూ గుండె జబ్బుల ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చని వైద్యులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు సీపీఆర్పై ప్రతి ఒక్కరికీ ప్రాథమిక అవగాహన అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ చందానగర్ సెంటర్ హెడ్ మల్లేష్ పాల్గొన్నారు.

## పాలమాకుల ఇనామ్షేర్లో ఘనంగా గణేష్ నవరాత్రి వేడుకలు

**రూ.32,501లకు లడ్డూను దక్కించుకున్న కోడి ప్రవీణ్**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పాలమాకుల ఇనామ్షేర్లో టీమ్ ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన శ్రీ వినాయకుడి నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగాయి. 15 రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి మొక్కులు చెల్లించుకున్నారు. వినాయక నవరాత్రుల ముగింపు సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో గ్రామానికి చెందిన కోడి ప్రవీణ్ ఉత్సాహంగా పాల్గొని రూ.32,501లకు గణనాథుడి లడ్డూను దక్కించుకున్నారు. వేలం పాటలో భక్తులు పోటాపోటీగా పాల్గొనడంతో సందడి నెలకొంది. గణనాథుడి లడ్డూను దక్కించుకోవడం తమకు అదృష్టంగా భావిస్తున్నామని కోడి ప్రవీణ్ తెలిపారు. అనంతరం నిర్వహకులు కోడి ప్రవీణ్ను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి, పూజలు అందుకున్న గణనాథుడి లడ్డూను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం గణేష్ ఉత్సవాలను గ్రామస్తుల సహకారంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత ఐకమత్యంతో ఉత్సవాలను విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. చివరగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తుల జయజయధ్వానాల మధ్య నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమంలో యువత, చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిగీతాలు, డీజే సందడి మధ్య గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు. గ్రామంలో ప్రశాంత వాతావరణంలో వేడుకలు ముగిశాయి.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.లక్ష చెక్కు అందజేత

**ఇందిరాగాంధీ హౌసింగ్ బోర్డు సొసైటీ ఆధ్వర్యంలో భద్రతకు ప్రాధాన్యం**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నేరాల నియంత్రణ, కాలనీల్లో భద్రతను మరింత పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని ఇందిరాగాంధీ హౌసింగ్ బోర్డు సొసైటీ అధ్యక్షుడు సంకూరి జయప్రకాష్, ఉపాధ్యక్షుడు కె. ఎల్లప్ప అన్నారు. ఇందిరాగాంధీ హౌసింగ్ బోర్డు సొసైటీలో సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారంగా ఇందిరాగాంధీ హౌసింగ్ బోర్డు సొసైటీ అధ్యక్షుడు ఎస్. జయప్రకాష్, ఉపాధ్యక్షుడు కె. ఎల్లప్ప, సొసైటీ సభ్యుల సమక్షంలో పహాడీషరీఫ్ సీఐ బి. లక్ష్మీనారాయణరెడ్డికి రూ.1 లక్ష విలువైన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జయప్రకాష్, ఎల్లప్ప మాట్లాడుతూ.. నేటి పరిస్థితుల్లో ప్రతి కాలనీ, అపార్ట్మెంట్, నివాస ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, అనుమానాస్పద కార్యకలాపాలు, చోరీలు, ఇతర నేరాలకు సంబంధించిన దృశ్యాలను సీసీ కెమెరాల ద్వారా గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం అన్న స్థాయిలో నిఘా వ్యవస్థకు వీటి ప్రాధాన్యత ఉందని జయప్రకాష్ అన్నారు. ఏదైనా నేరం జరిగినప్పుడు నిందితులను గుర్తించడంతో పాటు ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించడంలో సీసీ కెమెరాల ఫుటేజీ పోలీసులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కాలనీలోని ప్రధాన ప్రవేశ ద్వారాలు, రహదారులు, రద్దీ ప్రాంతాలు, సున్నితమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నిరంతరం నిఘా కొనసాగించవచ్చని అన్నారు. ప్రజలు కూడా తమ ఇళ్ల వద్ద, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలార్దేవ్పల్లి పోలీస్ సిబ్బంది, ఇందిరాగాంధీ హౌసింగ్ బోర్డు సొసైటీ కమిటీ సభ్యులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు. సొసైటీ తరపున భద్రతకు సహకరిస్తూ రూ.లక్ష చెక్కు అందజేయడంపై పోలీసు అధికారులు అభినందనలు తెలిపారు.

## పురాతన ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి శాంతియుతంగా ముందుకు సాగాలి

**ఆలయ స్థల వివాదంపై గ్రామస్తులకు ఆర్. నరేష్ కుమార్ సూచనలు**



**క్రైమ్ మిర్రర్ శంకర్పల్లి:** సనాతన ధర్మ పరిరక్షణతో పాటు పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ ఎండోమెంట్స్ సెల్ ధార్మిక రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్ ఆర్. నరేష్ కుమార్ అన్నారు. మంగళవారం వికారాబాద్ ప్రాంతంలోని మన్నెగూడ సమీపంలో ఎనకపల్లి--విష్ణుగూడెం పరిధిలో ఉన్న సుమారు వందేళ్ల చరిత్ర కలిగిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఆలయ స్థల వివాదం, ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై గ్రామస్తులు, హిందూ ధర్మ పరిరక్షణ కోసం పనిచేస్తున్న యువకులతో ఆయన చర్చించారు.గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఆలయానికి వెళ్లిన నరేష్ కుమార్ ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి, అక్కడ ఉన్న పురాతన నాగుల గుండం సహా ఆలయ పరిసరాల పరిస్థితిని తెలుసుకున్నారు. ఆలయానికి సంబంధించిన భూమిలో కొంత భాగాన్ని మాత్రమే ఆలయానికి కేటాయించి, మిగిలిన భూమిని వదిలేయాలని రియల్ ఎస్టేట్ వర్గాల నుంచి ప్రతిపాదన వచ్చినట్లు గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆలయ భూమి విషయంలో గ్రామస్తులంతా ఏకతాటిపై ఉన్నారని తెలిపారు.ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ.. ఆలయ పరిసరాల్లో ఉన్న పురాతన నాగుల గుండం స్పష్టంగా కనిపించేలా ఈ శనివారం నాటికి చుట్టుపక్కల ఉన్న పొదలు, చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే వరుసగా ఐదు శనివారాలు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ ధార్మిక కార్యక్రమాలను కొనసాగించాలని తెలిపారు.ఆలయంలో నిరంతరం ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆలయ ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు, సమస్యను ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా శాంతియుతంగా, సామరస్యపూర్వకంగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.పురాతన ఆలయాలు కేవలం ప్రార్థనా స్థలాలు మాత్రమే కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, వాటి పరిరక్షణకు స్థానిక ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని నరేష్ కుమార్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, హిందూ ధర్మ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమం కోసం విప్లవాత్మక నిర్ణయాలు




**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 29:** రైతు లేకుంటే మనిషి మనుగడే అసాధ్యమన్నారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి. రోజు రోజుకు సాగు తగ్గిపోతుండటం ఆందోళనకరమన్నారు. తుర్కయంజాల్ సహకార సంఘం 55వ సర్వసభ్య సమావేశం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా రేవంత్ సర్కార్ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తోందన్నారు. రైతుల అభ్యున్నతికి తుర్కయంజాల్ ఎఫ్ఎస్సీఎస్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తొలినుంచి తుర్కయంజాల్ సహకార బ్యాంకు పనితీరు అత్యుత్తమంగా ఉందన్నారు. బ్యాంకు సాధించిన లాభాలను ఏ రూపంలోనైనా రైతు కోసమే ఖర్చుచేయాలని సూచించారు. పాలకవర్గం విజ్ఞప్తి మేరకు సహకార సంఘానికి భూమిలిప్పించే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. గోడౌన్లు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, నాణ్యమైన ఆయిల్ ఉత్పత్తి కోసం నూనెగింజల ప్రాసెసింగ్పై దృష్టి సారించాలని పాలకవర్గానికి మల్రెడ్డి రంగారెడ్డి సూచనలు చేశారు. అనంతరం పలువురు రైతులకు వ్యవసాయ పనిముట్లను, చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, ఎఫ్ఎస్సీఎస్ వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, సీనియర్ నాయకులు సామ సంజీవరెడ్డి, గుండ్లపల్లి ధన్రాజ్గౌడ్, కొశికె ఐలయ్య, ఓర్సు శ్రీనివాస్, సామ భీంరెడ్డి, కొంతం వెంకటరెడ్డి, చాపల యాదగిరి, సంఘం సీఈవో వై.రాందాస్ తదితరులు పాల్గొన్నార.

# అభివృద్ధిపై బహిరంగ చర్చకు రండి

## బీఆర్ఎస్, సీపీఐ విమర్శలకు కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ కౌంటర్

### మున్సిపల్ సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలి.. మంత్రి వివేక్‌పై నిరాధార వ్యాఖ్యలు సరికాదు

**రామకృష్ణాపూర్, సెప్టెంబరు 29 (క్రైమ్ మిర్రర్):** క్యాతనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి, సాధారణ కౌన్సిల్ సమావేశం ఎజెండాపై బీఆర్ఎస్, సీపీఐ నాయకులు చేస్తున్న విమర్శలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ అన్నారు. చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి వివేక్ వెంకటస్వామిపై నిందలు వేస్తున్నారని ఆయన విమర్శించారు.మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీలో సాధారణ కౌన్సిల్ సమావేశం ఎజెండా లేకుండానే జరిగిందంటూ బీఆర్ఎస్, సీపీఐ కౌన్సిలర్లు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఈ నెల 21న మున్సిపల్ కమిషనర్ 29 అభివృద్ధి అంశాలతో కూడిన ఎజెండాను చైర్‌పర్సన్ టేబుల్‌కు పంపించారని తెలిపారు. అయితే వాటిపై ముందస్తుగా చర్చించకుండా కేవలం నోటీసు లేఖను కౌన్సిలర్లకు అందజేశారని పేర్కొన్నారు. అభివృద్ధి అంశాలను పక్కనపెట్టి మంత్రి వివేక్ వెంకటస్వామిపై రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు.

**రూ.100 కోట్లకు పైగా పనులు**

చెన్నూరు నియోజకవర్గంలో, ముఖ్యంగా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో రూ.100 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అభివృద్ధి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధిపై బీఆర్ఎస్ నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు.



**పాలకవర్గానిదే బాధ్యత**

క్యాతనపల్లి మున్సిపాలిటీలో ప్రస్తుత పాలకవర్గం బీఆర్ఎస్‌కు చెందినదేనని ఆయన అన్నారు. 22 వార్డుల్లోని సమస్యలను గుర్తించి, మున్సిపల్ కమిషనర్‌తో సమన్వయం చేసుకుని ప్రజలకు ఉపయోగపడేలా ఎజెండా రూపొందించాల్సిన బాధ్యత పాలకవర్గంపైనే ఉందన్నారు. కౌన్సిల్ సమావేశాలు, అభివృద్ధి అంశాలపై ముందస్తు సమన్వయం అవసరమని పేర్కొన్నారు.

**సమస్యలుంటే చర్చించాలి**

మున్సిపాలిటీలో పారిశుధ్యం, వీధిదీపాలు, రోడ్లు తదితర సమస్యలు ఉంటే అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరించుకోవాలని వోడ్నాల శ్రీనివాస్ సూచించారు. మున్సిపల్ కమిషనర్‌తో ఏమైనా సమస్య ఉంటే సీడీఎంఏ లేదా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. రోడ్డెక్కి రచ్చ చేయడం వల్ల ప్రజా సమస్యలు పరిష్కారం కావని పేర్కొన్నారు.

**రాజా రమేష్ వ్యాఖ్యలపై స్పందన**

స్థానిక నాయకుడు రాజా రమేష్ చేసిన వ్యాఖ్యలపై వోడ్నాల శ్రీనివాస్ స్పందించారు. రాజకీయ అనుభవం, అవగాహన లేకుండా ఇష్టానుసారం వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాజకీయాల్లో సీనియర్లను, గతంలో పనిచేసిన నాయకులను గుర్తుంచుకుని మాట్లాడాలని సూచించారు. వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండాలని హితవు పలికారు.

**ఆరోపణలు చేస్తే ఆధారాలు చూపాలి**

ఎవరిపైనైనా ఆరోపణలు చేయడం సులభమేనని, వాటిని ఆధారాలతో నిరూపించినప్పుడే ప్రజలు విశ్వసిస్తారని అన్నారు. గతంలో సింగరేణి మెడికల్ కేసుల్లో డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు చేసినా, వాటికి ఆధారాలు చూపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసి ప్రజలను గందరగోళానికి గురిచేయడం సరికాదన్నారు.

**మంత్రి జోలికి వస్తే ఊరుకోం**

అభివృద్ధి కోసం కృషి చేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామిని రాజకీయ ప్రయోజనాల కోసం వివాదాల్లోకి లాగడాన్ని కాంగ్రెస్ శ్రేణులు సహించవని వోడ్నాల శ్రీనివాస్ హెచ్చరించారు. మంత్రి, స్థానిక అధికారులపై నిరాధార వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు నాయకులు,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



## లాన్ టెన్నిస్‌లో విజేతలకు డీసీపీ చేతుల మీదుగా ట్రోఫీలు




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026లో భాగంగా నిర్వహిస్తున్న లాన్ టెన్నిస్ పోటీల్లో 50ం విభాగం సింగిల్స్, డబుల్స్‌లో ప్రతిభ కనబరిచిన విజేతలకు చెవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్, ఐపీఎస్ ట్రోఫీలు, పతకాలను అందజేశారు. వట్టినాగులపల్లిలోని విజయ్ టెన్నిస్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందించి అభినందించారు. పోలీసు సిబ్బందిలో క్రీడాస్ఫూర్తి, ఆరోగ్యం, క్రమశిక్షణను పెంపొందించడంలో పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. లాన్ టెన్నిస్ పోటీల నిర్వహణకు ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డీఎస్పీ ఎ. తిరుపతి ఇన్‌చార్జిగా వ్యవహరించారు.

## ఎంజీఐటీ--ఆక్టోరిక్స్ టెక్నాలజీస్ మధ్య అవగాహన ఒప్పందం

### కృత్రిమ మేధస్సు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ)లోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగం, ఐఐటీ హైదరాబాద్‌లోని టెక్నాలజీ ఇన్నోవేషన్ పార్క్ (టీఐపీ), ఆర్అండ్‌డీ సెంటర్‌కు చెందిన ఆక్టోరిక్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను ఘనంగా ప్రారంభించారు. ఈ ఒప్పందం ద్వారా పరిశ్రమ--విద్యాసంస్థల మధ్య సహకారం మరింత బలోపేతం కానుంది. ముఖ్యంగా విద్యార్థులకు కృత్రిమ మేధస్సు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ ఆధారిత ప్రాజెక్టులపై ప్రాయోగిక పరిజ్ఞానం పొందేందుకు అవకాశాలు లభించనున్నాయి. వాస్తవ ప్రపంచంలో ఎదురయ్యే సమస్యలకు ఏఐ ఆధారిత సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయడంతో పాటు వినూత్న ఆలోచనలు, పరిశోధనలకు ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వేదికగా నిలవనుంది. ఈ సందర్భంగా ఎంజీఐటీ ప్రిన్సిపాల్ డా. జి. చంద్ర మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా. కె. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా అందుబాటులోకి వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఏఐ రంగంలో తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు దాదాపు అన్ని రంగాల్లో కీలకంగా మారుతోందని తెలిపారు. ముఖ్యంగా ఎనర్జీ రంగంలో ఏఐ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమ సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు పరిశోధన, ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ ఎంఓయూ ద్వారా ఎంజీఐటీ విద్యార్థులు, అధ్యాపకులు ఆక్టోరిక్స్ టెక్నాలజీస్ నిపుణులతో కలిసి ఏఐ ఆధారిత ప్రాజెక్టులు, పరిశోధన కార్యక్రమాలు, శిక్షణా తరగతులు, వర్క్‌షాప్‌లు నిర్వహించే అవకాశం ఏర్పడనుంది. పరిశ్రమలో ప్రస్తుతం ఉన్న అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించడం ద్వారా ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్ సాంకేతిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులను పరిశ్రమకు సిద్ధం చేయడం, కొత్త సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన కల్పించడం, పరిశోధనలకు ప్రోత్సాహం అందించడం వంటి అంశాల్లో ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కీలక పాత్ర పోషించనుంది. విద్యార్థులు తరగతి గది పరిజ్ఞానాన్ని పరిశ్రమలోని వాస్తవ సమస్యలకు అన్వయించుకునే అవకాశం కూడా లభించనుంది. కార్యక్రమంలో ఎంజీఐటీ ప్రిన్సిపాల్ డా. జి. చంద్ర మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా. కె. సుధాకర్‌రెడ్డి, ఈఈఈ విభాగాధిపతి డా. పి. రామ్ కిషోర్ కుమార్‌రెడ్డి, ఆక్టోరిక్స్ టెక్నాలజీస్ ప్రతినిధులు వి. పాండు రంగారావు, ఎం. విజయ్ కుమార్‌రెడ్డి, డా. బి. కోటి రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ డీఈ డా. జి. మహేష్, ఈఈఈ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంజీఐటీ-ఈఈఈ విభాగంలో సోలార్ పీవీ ప్లాంట్ డిజైన్‌పై శిక్షణ

### పీవీసిస్ట్ సాఫ్ట్‌వేర్‌తో సౌర విద్యుత్ ప్లాంట్ల రూపకల్పనపై విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ)లోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగం ఆధ్వర్యంలో సోలార్ పీవీ ప్లాంట్ డిజైన్ విత్ పీవీసిస్ట్ సాఫ్ట్‌వేర్ అంశంపై మూడు రోజుల నైపుణ్య ఆధారిత శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 1 వరకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సౌర విద్యుత్ రంగంలో విద్యార్థులకు సాంకేతిక, ప్రాక్టికల్ నైపుణ్యాలను అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన హెచ్ఐఈఈ ఎంపవరింగ్ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ కె. మదన్ మోహన్ గౌడ్ ఈ శిక్షణకు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ మూడు రోజుల శిక్షణలో సౌర విద్యుత్ వ్యవస్థల రూపకల్పన, సోలార్ పీవీ ప్లాంట్లలో వినియోగించే వివిధ పరికరాలు, ప్లాంట్ సామర్థ్య నిర్ధారణ, పనితీరు విశ్లేషణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ముఖ్యంగా పి విఎస్ వై ఎస్ టి సాఫ్ట్‌వేర్ ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్ల డిజైన్, సిమ్యులేషన్, పనితీరు అంచనా, సాంకేతిక నివేదికల తయారీపై ప్రత్యక్ష శిక్షణ అందించనున్నారు. కార్యక్రమ ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజీఐటీ ప్రిన్సిపాల్ డా. జి. చంద్ర మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్, ఇంధన రంగాల్లో కృత్రిమ మేధస్సు (ఏఐ) అనుసంధానం భవిష్యత్‌లో కీలకంగా మారనుందని తెలిపారు. విద్యుత్ వ్యవస్థల నిర్వహణ, శక్తి సామర్థ్యం, పునరుత్పాదక ఇంధన వనరులు, స్మార్ట్ ఎనర్జీ అప్లికేషన్లలో ఏఐ వినియోగం క్రమంగా విస్తరిస్తోందన్నారు. విద్యార్థులు సాంప్రదాయ సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఏఐ ఆధారిత నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఎంజీఐటీ వైస్ ప్రిన్సిపాల్ డా. కె. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్ విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఎనర్జీ ఆడిటింగ్, పునరుత్పాదక ఇంధన వనరులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. సోలార్ పంపులు, సోలార్ హీటింగ్ వ్యవస్థలు తదితర సౌర ఆధారిత సాంకేతికతల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఈ రంగంలో అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఐ ప్రస్తుతం దాదాపు అన్ని రంగాల్లోనూ కీలక సాంకేతికతగా మారిందని, ముఖ్యంగా ఎనర్జీ సెక్టార్‌లో దీని వినియోగం మరింత పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమ సామర్థ్యాలను పెంచుకుని మెరుగైన కెరీర్ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. కీనోట్ స్పీకర్ డా. జి. మహేష్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశ విద్యుత్ రంగం గణనీయమైన అభివృద్ధి సాధించిందని వివరించారు. దేశ ఆర్థిక, పారిశ్రామిక, సాంకేతిక పురోగతికి అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలు విస్తరించాయని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు సంప్రదాయ ఇంధన వనరులతో పాటు పునరుత్పాదక ఇంధన వనరుల వాటాను మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సౌర, పవన తదితర పునరుత్పాదక ఇంధన వనరులు భవిష్యత్ విద్యుత్ అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తాయని డా. మహేష్ పేర్కొన్నారు. విద్యార్థులు ఈ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుని, అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులకు సౌర విద్యుత్ ప్లాంట్ల రూపకల్పనపై సైద్ధాంతిక పరిజ్ఞానంతో పాటు పి విఎస్ వై ఎస్ టి వంటి పరిశ్రమలో ఉపయోగించే సాఫ్ట్‌వేర్‌పై ప్రత్యక్ష ప్రాక్టికల్ అనుభవం లభించనుంది. దీనివల్ల సౌర విద్యుత్ ప్రాజెక్టుల రూపకల్పన, విశ్లేషణ, పనితీరు అంచనా వంటి అంశాల్లో విద్యార్థుల సామర్థ్యం పెరగడంతో పాటు భవిష్యత్ ఉపాధి, కెరీర్ అవకాశాలకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంజీఐటీ ప్రిన్సిపాల్ డా. జి. చంద్ర మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా. కె. సుధాకర్‌రెడ్డి, ఈఈఈ విభాగాధిపతి డా. పి. రామ్ కిషోర్ కుమార్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్ కె. మదన్ మోహన్ గౌడ్, కీనోట్ స్పీకర్ డా. జి. మహేష్, ఆక్టోరిక్స్ ప్రతినిధులు వి. పాండురంగారావు, ఎం. విజయ్ కుమార్‌రెడ్డి, డా. బి. కోటి రెడ్డి, ఈఈఈ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నాయకుడు కోట పవన్‌కుమార్ జన్మదిన వేడుకలు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కాటేదాన్ డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్ నవోదయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు కోట పవన్‌కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పవన్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ నివాసంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కేక్ కట్ చేయించి పవన్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పవన్‌కుమార్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ప్రజా సేవలో మరింత చురుగ్గా పనిచేస్తూ యువతకు ఆదర్శంగా నిలవాలని ఆయన సూచించారు. నవోదయ యూత్ అసోసియేషన్ ద్వారా స్థానికంగా చేపడుతున్న సామాజిక, సేవా కార్యక్రమాలను పలువురు నాయకులు అభినందించారు. యువత సమాజ సేవలో ముందుండాలని, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎన్. ధనంజయ, టి. ప్రేమ్‌గౌడ్, యంజాల మహేష్, రాజ్, అనిల్, మహిళా నాయకురాళ్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, నవోదయ యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొని కోట పవన్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## రగ్బీ లో మొదటి బహుమతి సాధించిన బోదులబండ కు చెందిన షేక్ హస్రిన్ బేగం.

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం సర్దార్ వల్లబయ్ పటేల్ స్టేడియంలో జరిగిన హస్మిత రగ్బీ పోటీల్లో డోర్నకల్ గురుకుల మైనారిటీ స్కూల్ తరపున బోదులబండ గ్రామానికి చెందిన షేక్ హస్రిన్ బేగం సారథ్యంలో ఆడిన టీమ్ మొదటి బహుమతి సాధించింది. టీమ్ సభ్యులను ప్రిన్సిపాల్ తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు



# భూ సమస్యలపై రాజకీయ దుమారం..

## 'నేను ఎన్నడూ పట్టించుకోలేదనడం అవాస్తవం.. ప్రజల కోసం ఏళ్లుగా పోరాడుతున్నా'

## రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ మండలంలోని బహదూర్‌గూడ భూములతో పాటు వివిధ ప్రాంతాల్లో నెలకొన్న భూ సమస్యలపై రాజకీయంగా మాటల యుద్ధం మొదలైంది. గత ప్రభుత్వ హయాంలో భూ సమస్యలను తన దృష్టికి తీసుకురాలేదంటూ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. తాను గత ప్రభుత్వాన్ని, అప్పటి ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులను పలుమార్లు కలిసి భూ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రాలు సమర్పించానని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన లేఖలు, అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు, అసెంబ్లీలో తాను సమస్యలను ప్రస్తావించిన వివరాలు తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. భూ సమస్యలపై తాను మౌనం వహించానన్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు. ప్రజల భూములు, వారి హక్కుల పరిరక్షణ కోసం నేను ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నాను. ఇది నిన్న మొదలైన పోరాటం కాదు. గత ప్రభుత్వాల నుంచి ప్రస్తుత ప్రభుత్వం వరకు ఇదే అంశంపై నిరంతరం ప్రయత్నిస్తున్నాను అని ఆయన పేర్కొన్నారు. 2022 డిసెంబర్ 22న అప్పా జంక్షన్ వద్ద శంషాబాద్ విమానాశ్రయానికి మెట్రో కనెక్టివిటీకి సంబంధించిన కార్యక్రమం సందర్భంగా జరిగిన బహిరంగ సభలోనే శంషాబాద్ ప్రాంతంలోని భూ సమస్యలను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు. ఆ సభ వేదికపై నుంచే ప్రజల భూ సమస్యలను ప్రస్తావించినప్పుడు సంబంధిత నేతలు, అధికారులు ఈ విషయాన్ని విన్నారని ఆయన పేర్కొన్నారు. అప్పుడే ఎమ్మెల్యే మా దృష్టికి భూ సమస్యలు తీసుకొచ్చి ఉంటే పరిష్కారం చూపేవాళ్లమని ఇప్పుడు చెప్పడం ఆశ్చర్యంగా ఉంది. బహిరంగ సభలోనే సమస్యను ప్రస్తావించిన విషయానికి సంబంధించిన ఆధారాలు నా వద్ద ఉన్నాయి అని ఆయన అన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాథమిక పనులు, సర్వేలు 2022 డిసెంబర్ నుంచే కొనసాగినట్లు పబ్లిక్ రికార్డుల్లోనూ నమోదైంది. అనంతరం రూట్ సర్వే, అలైన్‌మెంట్ నిర్ణయం, భూముల అవసరాలపై అధికారిక ప్రక్రియలు కొనసాగాయి. బహదూర్‌గూడతో పాటు అనేక ప్రాంతాల సమస్యలపై ప్రస్తావన... కేవలం బహదూర్‌గూడ భూముల సమస్య మాత్రమే కాకుండా శంషాబాద్ మండలంలోని కోత్వాల్‌గూడలోని ఎన్ఎంఐ ప్రాపర్టీస్, భూదాన్ భూములు, సుల్తాన్‌పల్లి, మల్కారం, జూకల్, రామంజాపూర్, పెద్దగోల్కొండ, చౌదరిగూడ, నర్కుడ, పెద్దషాపూర్ తదితర ప్రాంతాల్లోని భూ సమస్యలను కూడా గత ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు. అదేవిధంగా అత్తాపూర్‌లోని భూపాల్‌నగర్, జలాల్‌బాబానగర్, రాజేంద్రనగర్‌లోని హనుమాన్‌నగర్, గండిపేట మండలంలోని వట్టినాగులపల్లి తదితర ప్రాంతాల్లోని భూ సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు అధికారులను కలిసినట్లు వెల్లడించారు. ప్రజల భూములకు



సంబంధించిన వివాదాలు, హక్కులు, రికార్డుల సమస్యలు దీర్ఘకాలంగా కొనసాగుతున్నాయని, వాటిని ఒక్కరోజులో పరిష్కరించే పరిస్థితి ఉండదని ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల పరిశీలన, భూముల స్వభావం, పాత పత్రాలు, హక్కుల నిర్ధారణ, సంబంధిత శాఖల నివేదికలు వంటి అనేక అంశాలను పరిశీలించాల్సి ఉంటుందని తెలిపారు.

2017 అసెంబ్లీ సమావేశాల నుంచే ప్రస్తావన...

జలాల్‌బాబానగర్, భూపాల్‌నగర్, హనుమాన్‌నగర్ ప్రాంతాల భూ సమస్యలను 2017 నవంబర్ 6న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రస్తావించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీనికి సంబంధించిన వీడియోను కూడా మీడియా ముందు ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ రికార్డుల్లోనే నేను ఈ సమస్యలను ప్రస్తావించిన విషయం ఉంది. ప్రజల సమస్యలను అసెంబ్లీ వేదికగా మాట్లాడిన నేను, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లలేదని చెప్పడం ఎలా సాధ్యం? అని ప్రశ్నించారు. భూ సమస్యల పరిష్కారంపై తాను ఏ ప్రభుత్వాన్ని మినహాయించలేదని, అధికారంలో ఉన్న ప్రతి ప్రభుత్వాన్ని కలిసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు.

### వైఎస్ఆర్ హయాం నుంచే పోరాటం..

తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచే కాకుండా వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలం నుంచే ఆయా ప్రాంతాల్లోని భూ సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం కేసీఆర్ ప్రభుత్వంలోనూ ఇదే అంశంపై ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, సంబంధిత మంత్రులు, అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినట్లు పేర్కొన్నారు. ప్రత్యేకంగా 2020, 2022, 2023 సంవత్సరాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం అనేకసార్లు విజ్ఞప్తులు చేసినట్లు తెలిపారు. అప్పటి చీఫ్ సెక్రటరీ సోమేశ్‌కుమార్‌ను స్వయంగా కలిసి శంషాబాద్ మండలంలోని భూ సమస్యలపై వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. తాను సమర్పించిన వినతిపత్రాలు, అధికారుల నుంచి వచ్చిన సమాధానాలు, శాఖల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలకు సంబంధించిన పత్రాలు తన వద్ద ఉన్నాయని, అవసరమైతే వాటిని ప్రజలు, మీడియా ముందు ఉంచుతానని తెలిపారు.

### మాజీ ఎంపీ ద్వారా కూడా ప్రభుత్వ దృష్టికి...

మాజీ పార్లమెంట్ సభ్యుడు గడ్డం రంజిత్‌రెడ్డి ద్వారా కూడా భూ సమస్యలను అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు. దీనికి సంబంధించిన లేఖల ప్రతులు కూడా తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, అప్పటి ఆర్డీఓ చంద్రకళతో పాటు రెవెన్యూ అధికారులను కలిసి ప్రజల భూ సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టర్, కమిషనర్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయాల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా సమస్యపై తాను చేసిన ప్రయత్నాలకు ఆధారాలని పేర్కొన్నారు.

### పత్రాలు నా దగ్గర ఉన్నాయి...

నేను ఎవరి మీద వ్యక్తిగత విమర్శలు చేయడానికి ఈ వివరాలు చెప్పడం లేదు. వాస్తవాలు ప్రజలకు తెలియాలి. నేను ఏ రోజున ఎవరిని కలిశాను, ఏ సమస్యపై వినతిపత్రం ఇచ్చాను, ఏ అధికారికి లేఖ ఇచ్చాను అనే వివరాలకు సంబంధించిన పత్రాలు నా వద్ద ఉన్నాయి. వాటిని పరిశీలిస్తే భూ సమస్యలపై నేను చేసిన ప్రయత్నాలు స్పష్టమవుతాయి అని ఎమ్మెల్యే అన్నారు. రాజకీయంగా విమర్శలు చేయడం సహజమే అయినప్పటికీ, ప్రజల భూములు, వారి హక్కులకు సంబంధించిన అంశాలను రాజకీయ ఆరోపణలకు పరిమితం చేయకుండా సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

### ప్రస్తుత ప్రభుత్వంపైనా ఒత్తిడి కొనసాగిస్తానని స్పష్టం...

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ భూ సమస్యలపై తన పోరాటాన్ని కొనసాగిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనూ ఈ అంశాన్ని గట్టిగా ప్రస్తావించినట్లు చెప్పారు. ప్రజలు నన్ను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు. నా ప్రజల భూ సమస్యలను పరిష్కరించగలిగితే అంతకంటే గొప్ప సంతృప్తి నాకు మరొకటి ఉండదు అని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల నాటికి భూ సమస్యల పరిష్కారానికి స్పష్టమైన చర్యలు తీసుకోకపోతే సభా వేదికపై మరింత గట్టిగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానని, అవసరమైతే అసెంబ్లీ పోడియం ముందు ధర్నాకు కూడా వెనుకాడనని తాను స్పష్టం చేసినట్లు తెలిపారు.

ప్రజల ఆస్తులు, హక్కుల పరిరక్షణే నా బాధ్యత...

ప్రజల ఆస్తులు, భూములు, హక్కులను కాపాడటం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం అనే తేడా లేకుండా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులను సంప్రదించడం కొనసాగిస్తున్నానని తెలిపారు. శంషాబాద్ మండలంతో పాటు రాజేంద్రనగర్, అత్తాపూర్, గండిపేట ప్రాంతాల్లోని వివిధ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై జిల్లా స్థాయిలో ప్రత్యేక సమీక్ష నిర్వహించి, అవసరమైన చోట ఉన్నతాధికారుల కమిటీ ద్వారా రికార్డులను పరిశీలించి పరిష్కారం చూపాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలు సహకరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. "ప్రజల పక్షాన నా పోరాటం కొనసాగుతుంది. వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని మీడియా మిత్రులను కోరుతున్నాను" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో గణేష్ గుప్తా, చంద్రారెడ్డి, దూడల వెంకటేష్ గౌడ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.....

# హిందూ దేవుళ్లను రాజకీయాల్లోకి లాగడం బాధాకరం

**హరిహరులను విభజించే హక్కు సీఎంకు ఎవరిచ్చారు?**

**హిందూ సమాజానికి సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి**

**బీజేపీ పార్టీ జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద రావు మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్**

**కుల్కచర్ల అంబేద్కర్ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మ దహనం**

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** హిందూ సమాజం అత్యంత పవిత్రంగా ఆరాధించే శ్రీ రాముడు, పరమశివుడిని రాజకీయ ప్రయోజనాల కోసం పేదలు--ధనికులు, ఉత్తరాది--దక్షిణాది అంటూ విభజించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ పార్టీ జిల్లా కన్వీనర్ కరణం



ప్రహ్లాద రావు కుల్కచర్ల మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్ అన్నారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు నిరసనగా కుల్కచర్ల మండల కేంద్రంలో గుడాల వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం సీఎం దిష్టిబొమ్మ దహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ పార్టీ జిల్లా కన్వీనర్ రాష్ట్ర నాయకులు కరణం ప్రహ్లాద్ హాజరై, సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హరిహరులు ఒక్కటేనని, భక్తికి ప్రాంతం, కులం, ఆర్థిక స్థాయి అనే భేదాలు ఉండవని అన్నారు. కోట్లాది మంది హిందువులు ఆరాధించే శ్రీరాముడు, పరమశివుడిని రాజకీయాల్లోకి తీసుకువచ్చి వారి భక్తి విశ్వాసాలను విభజించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు.ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన ముఖ్యమంత్రి దేవుళ్లను రాజకీయాలకు ఉపయోగించుకోవడం బాధాకరమన్నారు. హిందూ సమాజం మనోభావాలను దెబ్బతీసే విధంగా చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, హిందూ సమాజానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వార్వాల్ల అంజిలయ్య, దిశా కమిటీ సభ్యులు డాక్టర్ జానకిరామ్ చవాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బృంగి హరికృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు గాదె మహిపాల్, మైనార్టీ మోర్చా అధ్యక్షులు రజాక్ పాషా, ఉప సర్పంచ్ విజయకుమార్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ గడుసు మహిపాల్, మండల ప్రధాన కార్యదర్శి హనుమంతు, మండల ఉపాధ్యక్షులు కొండ అంజి, సేవా సంపర్ అభియాన్ కన్వీనర్ గాదే మల్లేష్, నీరటి కర్ణయ్య, కుమ్మరి గోపాల్ ఇప్పాయిపల్లి వెంకటయ్య, నేరటి సంజు, కృష్ణయ్య, ఇప్పాయిపల్లి వెంకట రాములు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# బిజెపి పార్టీ నాయకులను అరెస్టు చేసి స్టేషన్ కు తరలించిన పోలీసులు





క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను చులకన చేసి మాట్లాడడం వల్ల కుల్కచర్ల బిజెపి పార్టీ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దాహనం చేశారు. ఈ సందర్భంగా కుల్కచర్ల పోలీసులు అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు. అరెస్టు అయిన వారిలో బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు వికారాబాద్ జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద రావు, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఎండి రజక పాషా, కుల్కచర్ల మండలం బిజెపి పార్టీ అధ్యక్షులు గుడాల వెంకటేష్, బిజెపి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గాదె మైపాల్ ముదిరాజ్, సేవా సంపర్ అభియాన్ కన్వీనర్ గాదే మల్లేష్, బిజెపి పార్టీ కుల్కచర్ల మండలం ఉపాధ్యక్షులు కొండా అంజి, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు కొత్తపల్లి వెంకటయ్య, కుమ్మరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# 70వ ఎస్‌జీఎఫ్ఐ జోనల్ టోర్నమెంట్‌లో రాజేంద్రనగర్ మండల సత్తా

**11 బహుమతులతో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన రాజేంద్రనగర్ మండలం**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్: 70వ ఎస్‌జీఎఫ్ఐ రాజేంద్రనగర్ జోనల్ స్థాయి టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌లో రాజేంద్రనగర్ మండలానికి చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. వివిధ క్రీడాంశాల్లో సత్తాచాటిన క్రీడాకారులు మొత్తం 24 బహుమతుల్లో 11 బహుమతులను కైవసం చేసుకుని ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచారు. రాజేంద్రనగర్ మండల విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడాంశాల్లో విజయాలు సాధించి తమ ప్రతిభను చాటారు. ముఖ్యంగా బాలికలు, బాలురు జట్లుగా పోటీపడి పలు విభాగాల్లో విజేతలుగా నిలవడం విశేషంగా నిలిచింది. అండర్-14 బాలికల ఖోఖో -- విన్నర్స్, అండర్-17 బాలికల ఖోఖో -- రన్నర్స్, అండర్-14 బాలుర ఖోఖో -- విన్నర్స్, అండర్-17 బాలుర ఖోఖో -- రన్నర్స్, అండర్-14 బాలుర విభాగం -- విన్నర్స్, అండర్-14 బాలుర వాలీబాల్ -- విన్నర్స్, అండర్-17 బాలుర వాలీబాల్ -- విన్నర్స్, అండర్-17 బాలుర కబడ్డీ -- రన్నర్స్, అండర్-17 బాలికల కబడ్డీ -- విన్నర్స్, అండర్-14 బాలికల కబడ్డీ -- విన్నర్స్, అండర్-14 బాలికల వాలీబాల్ -- విన్నర్స్, వివిధ క్రీడాంశాల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మండలానికి గుర్తింపు తీసుకురావడంపై రాజేంద్రనగర్ మండల ఎంఈఓ శంకర్ రాథోడ్ హర్షం వ్యక్తం చేశారు. విజేతలైన క్రీడాకారులను అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో భవిష్యత్ స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, పీఈటీలు, కోచ్‌లు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. మండల ఇన్‌చార్జ్ గాంగ్య నాయక్, బాలస్వామిరెడ్డి, వెంకట్, తరుణ్, మహేందర్ తదితరులు విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. జోనల్ స్థాయిలో రాజేంద్రనగర్ మండలం ఓవరాల్ ఛాంపియన్‌గా నిలవడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టుగా పనిచేసే తత్వం పెంపొందుతాయని, ఇలాంటి విజయాలు మరింత మంది విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహిస్తాయని పలువురు పేర్కొన్నారు.

# వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్‌లో ప్రత్యేక వాల్వ్ క్లినిక్ ప్రారంభం





గండిపేట(క్రైమ్ మిర్రర్): వరల్డ్ హార్ట్ డే సందర్భంగా గుండో వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సమగ్ర, అత్యాధునిక వైద్య సేవలను అందించేందుకు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్?లోని మెడికవర్ హాస్పిటల్స్? ప్రత్యేక వాల్వ్? క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ అగ్రిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్‌సింగ్‌మాన్ హాజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ గుండె ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు ప్రత్యేక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గుండె సమస్యలు ప్రస్తుతం పెరుగుతున్న నేపథ్యంలో వాటిని ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స అందించేందుకు ఈ ప్రత్యేక వాల్వ్? క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ క్లినిక్ ద్వారా కార్డియాలజిస్టులు, కార్డియాక్ సర్జన్లు, ఇతర నిపుణులు కలిసి ప్రతి రోగికి వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స. అందించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్? డాక్టర్ ఎ.శరత్‌రెడ్డి మాట్లాడుతూ వరల్డ్? హార్ట్? డే సందర్భంగా ప్రారంభించిన ఈ వాల్వ్? క్లినిక్ గుండె వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సమస్యలను నిర్లక్ష్యం చేస్తే గుండె వైఫల్యం వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. సరైన సమయంలో నిర్ధారణ చేసి చికిత్స అందించడం ద్వారా రోగులు సాధారణ జీవితాన్ని కొనసాగించవ్చు మా వాల్వ్? క్లినిక్‌లో అత్యాధునిక నిర్ధారణ, వైద్య, శస్త్రచికిత్స సేవలు ఒకే చోట అందుబాటులో ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో కార్డియాలజిస్ట డాక్టర్ శ్రీకాకుళపు శ్రీకృష్ణ, కార్డియోథోరాసిక్ అండ్ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ వివేక్ బాబు బొజ్జవార్, రీజినల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీవాస్తవ్, డాక్టర్ స్వరూప, డాక్టర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 బుధవారం 30-9-2026

# శంషాబాద్‌లో 111 జీవోకు తూట్లు?

## అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు..

## అధికారుల తీరుపై సీపీఐ మండల కార్యదర్శి నర్రగిరి విమర్శలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ మండల కేంద్రంలో 111 జీవో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ మండల కార్యదర్శి నర్రగిరి ఆరోపించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం సమీపంలోనే భారీ నిర్మాణాలు జరుగుతున్నాయని, నిబంధనలు అమల్లో ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. శంషాబాద్ పరిధిలోని 111 జీవో పరిధిలో నిర్మాణాల విషయంలో నిబంధనలు పాటించాల్సి ఉన్నప్పటికీ, కొందరు భూయజమానులు, నిర్మాణదారులు ఎలాంటి అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారని నర్రగిరి ఆరోపించారు. ముఖ్యంగా రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలోని ప్రాంతాల్లో భవన నిర్మాణాలపై విమానాశ్రయ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలిపారు. శంషాబాద్ మున్సిపల్ అధికారులు కొందరు నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసినప్పటికీ, వాటిని పట్టించుకోకుండా పనులు కొనసాగిస్తున్నారని ఆయన అన్నారు. నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా నిర్మాణాలు ఎలా కొనసాగుతున్నాయో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విమానాశ్రయానికి సమీపంలో ఉన్న ఏకే టౌన్‌షిప్ ప్రాంతంలోనూ అనుమతులకు విరుద్ధంగా భవనాల్లో అదనపు అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారని నర్రగిరి ఆరోపించారు. సంబంధిత అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, కొన్ని భవనాలు ఏడు, ఎనిమిది అంతస్తుల వరకు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. విమానాశ్రయ భద్రత, పట్టణ ప్రణాళిక, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని సీపీఐ నాయకుడు కోరారు. ఇప్పటికే నిర్మించిన భవనాలు, కొనసాగుతున్న నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, ప్లాన్లు, సంబంధిత శాఖల నుంచి తీసుకున్న క్లియరెన్స్‌లను పరిశీలించాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని నర్రగిరి కోరారు. 111 జీవో అమలు విషయంలో అధికారులు స్పష్టమైన వైఖరి అవలంబించి, నిబంధనలు ఉల్లంఘించే నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# శ్రీ హస్తాల వీరన్న దేవాలయంలో అక్రమ నిర్మాణాలపై అధికారుల తనిఖీ

## ఫిర్యాదుతో స్పందించిన రెవెన్యూ, పోలీస్, ఎండోమెంట్, హైడ్రా అధికారులు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని చింతల్‌మెట్ ఉప్పర్‌పల్లిలో ఉన్న శ్రీ హస్తాల వీరన్న దేవాలయం గుండం వద్ద జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమ నిర్మాణ పనులపై అధికారులు స్పందించారు. నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరుతూ సంబంధిత అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో శనివారం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. దేవాలయ పరిసరాల్లో అనుమతులు లేకుండా నిర్మాణ పనులు జరుగుతున్నాయన్న ఆరోపణలపై నిన్న రాజేంద్రనగర్ తహసీల్దార్ (ఎంఆర్ఓ), అత్తాపూర్ పోలీసులకు, ఎండోమెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన అధికారులు శనివారం ఉదయం 11 గంటల సమయంలో దేవాలయ ప్రాంగణానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. రాజేంద్రనగర్ ఎంఆర్ఓ రాములు, అత్తాపూర్ సీఐ సీతయ్య, హైడ్రా సీఐ సైదులు, ఎండోమెంట్ ఈఓ రామదాదేవి తదితరులు దేవాలయ పరిసరాలను పరిశీలించి నిర్మాణాలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనులకు అనుమతులు ఉన్నాయా? సంబంధిత స్థలానికి సంబంధించిన రికార్డులు, పత్రాలు ఏమిటి? అనే అంశాలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. దేవాలయాల పరిసరాల్లో నిర్మాణాలు చేపట్టే సమయంలో సంబంధిత శాఖల నిబంధనలు, అనుమతులు పాటించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొన్నారు. దేవాలయానికి సంబంధించిన స్థలాలు, ఆస్తుల పరిరక్షణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ సందర్భంగా గోల్కొండ--గోషామహల్ జిల్లా ఇన్‌చార్జి వై. శ్రీధర్, వనపర్తి జిల్లా ఇన్‌చార్జి బొక్క బాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఎస్. విఠల్, వెంకట్‌రెడ్డి, విక్రమ్‌చారి, శ్రీను, స్థానిక నాయకులు నర్సింగ్ యాదవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. దేవాలయానికి సంబంధించిన భూములు, నిర్మాణాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. అధికారుల తనిఖీ అనంతరం తదుపరి చర్యలు ఏ విధంగా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.---





# మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు గర్వకారణం

## జాతీయ ఛాంపియన్‌షిప్‌లో భావనకు స్టార్ ఆఫ్ ఇండియా అవార్డు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్రీడాకారిణి భావన జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటి ప్రత్యేక గుర్తింపు పొందడం పట్ల అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాళహస్తిలో సెప్టెంబర్ 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన 72వ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2026--27లో తెలంగాణ రాష్ట్ర మహిళల జట్టు తరపున భావన అద్భుత ప్రదర్శన కనబరిచింది. తెలంగాణ మహిళల జట్టులో భావనతో పాటు రాధిక, అంజలి, ధనలక్ష్మి, దేవికలు సమన్వయంతో ఆడి జట్టును విజయాల బాటలో నడిపించారు. శుక్రవారం జరిగిన పోటీలో కేరళ జట్టుపై 35--32, 36--34 పాయింట్ల తేడాతో విజయం సాధించారు. అనంతరం శనివారం ఛత్తీస్‌గఢ్ జట్టుపై 35--22, 35--29 పాయింట్లతో గెలుపొందారు. ఆదివారం మహారాష్ట్రతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో 35--24, 30--35, 35--33 పాయింట్లతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నారు. సెమీఫైనల్‌లో కర్ణాటక జట్టుతో జరిగిన పోటీలో తెలంగాణ జట్టు ఓటమి పాలైంది. దీంతో ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్ర మహిళల జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో తెలంగాణ జట్టు నాలుగో స్థానం సాధించడం రాష్ట్ర క్రీడారంగానికి, ముఖ్యంగా బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు గర్వకారణమని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. టోర్నీ ఆరంభం నుంచి తెలంగాణ జట్టు తరపున అద్భుత ప్రదర్శన కనబరిచిన మణికొండకు చెందిన క్రీడాకారిణి భావనకు ప్రతిష్టాత్మకమైన స్టార్ ఆఫ్ ఇండియా ప్రత్యేక అవార్డు లభించింది. జాతీయ స్థాయి వేదికపై ప్రతిభ చాటుకుని ఈ అవార్డు అందుకోవడం మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు ప్రత్యేక గర్వకారణంగా నిలిచింది. భావన సాధించిన ఈ విజయంపై అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ నవీన్ కుమార్, సలహాదారు అందె లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాసరావుతో పాటు సభ్యులు హరినాథ్‌రెడ్డి, సాయిరామ్, వినయ్, శాస్త్రి, రాంరెడ్డి, టి. శ్రీనివాసరావులు హర్షం వ్యక్తం చేశారు. భావనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్‌లో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న యువతకు సరైన శిక్షణ, ప్రోత్సాహం, అవకాశాలు అందిస్తే జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించే అవకాశం ఉంటుందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. క్రీడాకారిణుల ప్రతిభను గుర్తించి, వారికి విలువైన మద్దతు, ప్రోత్సాహం అందిస్తున్న తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. మణికొండ నుంచి జాతీయ స్థాయికి ఎదిగి 'స్టార్ ఆఫ్ ఇండియా' అవార్డు సాధించిన భావన విజయం స్థానిక యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిది

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ చేసిన అనాసాగరం ఉప సర్పంచ్ షేక్ మదార్ సాహెబ్



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** నేలకొండపల్లి మండల పరిధిలోని అనాసాగరం గ్రామానికి చెందిన షేక్ లాల్ బీ కి మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అనాసాగరం గ్రామ ఉప సర్పంచ్ షేక్ మదార్ సాహెబ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సిఫారసు మేరకు షేక్ లాల్ బీ కి దాదాపు 50 వేల రూపాయలు మంజూరైనట్టు తెలిపారు.సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరు చేయించినందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి షేక్ మదార్ సాహెబ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అనాసాగరం గ్రామ మాజీ సర్పంచ్ చిలకబత్తిన వీరబాబు మాజీ వార్డ్ మెంబర్ జోగుపర్తి వెంకన్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు తుమ్మలపల్లి వెంకటనారాయణ బొడ్డు నాగేశ్వరరావు నోముల వెంకటనారాయణ కోడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# జెఎన్టీయు సుల్తాన్‌పూర్ ర్యాగింగ్ ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ, యుఎస్ఎఫ్ఐ డిమాండ్

సంగారెడ్డి, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 29: జెఎన్టీయు సుల్తాన్‌పూర్ కళాశాల పరిధిలో ర్యాగింగ్‌కు సంబంధించిన అంశంపై విద్యార్థుల మధ్య జరిగినట్లు పేర్కొంటున్న ఘర్షణపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్‌కు, టిఆర్పీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు నవాజ్ , యుఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు సందీప్ తో కలిసి వినతిపత్రం సమర్పించారు. కళాశాలలో విద్యార్థుల భద్రత, ప్రశాంతమైన విద్యా వాతావరణం అత్యంత ముఖ్యమని ఆ నాయకులు పేర్కొన్నారు. ఘటనకు అసలు కారణాలను గుర్తించేందుకు ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని వారు కోరారు. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై కళాశాల నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ర్యాగింగ్‌కు దారితీసిన పరిస్థితులను కూడా పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యాంటీ-ర్యాగింగ్ చర్యలను మరింత పటిష్టంగా అమలు చేయాలని కోరారు. విద్యార్థులందరికీ సురక్షితమైన, ప్రశాంతమైన విద్యా వాతావరణం కల్పించాలని టిఆర్పీ పార్టీ, యుఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది.

# అనధికార నిర్మాణాలపై సీఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు ముమ్మరం

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో అనధికార నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. భవన నిర్మాణ నిబంధనల అమలును నిర్ధారించేందుకు మూడు జోన్లలో సీఎంసీ బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను ముమ్మరం చేశాయి. నేటి ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా ఌ15 అనధికార నిర్మాణాలను గుర్తించి, 15 కూల్చివేతలు చేపట్టగా, 2 నోటీసులు జారీ చేశారు.జోన్ల వారీగా కూల్చివేతల వివరాలు... శేరిలింగంపల్లి జోన్ 5, కూకట్‌పల్లి జోన్ 4,కుత్బుల్లాపూర్ జోన్: 6 మూడు జోన్లలోనూ అనధికార నిర్మాణాల గుర్తింపు నుంచి తదుపరి చర్యల వరకు క్షేత్రస్థాయిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. గుర్తించిన ప్రతి కేసును నిర్దేశిత విధానం మరియు అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలకు తీసుకెళ్తున్నారు.ప్రతి గుర్తించిన కేసుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, సకాలంలో తదుపరి చర్యలు చేపట్టాలని సీఎంసీ కమిషనర్ సంబంధిత బృందాలను ఆదేశించారు. అనధికార నిర్మాణాలను నియంత్రించేందుకు సీఎంసీ పరిధిలో సమన్వయంతో తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు కొనసాగనున్నాయి.

# రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్లలో సిబ్బంది కొరత

## కార్మికులపై పెరుగుతున్న పని ఒత్తిడి.. సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ వినతి



గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వివిధ విద్యుత్ డివిజన్లలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్--82) నాయకులు సూపరింటెండింగ్ ఇంజనీర్‌కు వినతిపత్రం సమర్పించారు. సిబ్బంది కొరత, స్పాట్ బిల్లింగ్ అమలు, ఎఫ్ఓసీ సిబ్బంది, వాహనాల కొరతతో పాటు స్పాట్ బిల్లర్లకు జీతాలు అందకపోవడం వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్లలో సబ్‌స్టేషన్ ఆపరేటర్ల కొరత తీవ్రంగా ఉందని యూనియన్ నాయకులు తెలిపారు. నలుగురు సిబ్బంది పనిచేయాల్సిన చోట ఇద్దరితోనే విధులు నిర్వహింపజేస్తుండటంతో పని ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. ప్యాద్‌నగర్ డివిజన్‌లో 8, రాజేంద్రనగర్ డివిజన్‌లో 4, రాజేంద్రనగర్ లైన్స్ డివిజన్‌లో 2, కందుకూరు డివిజన్‌లో 3 సబ్‌స్టేషన్లు ఇద్దరు ఆపరేటర్లతోనే నడుస్తున్నాయని వివరించారు. గత ఏడాది ఆగస్టు నుంచి స్పాట్ బిల్లింగ్‌లో 65 శాతం పనిని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించినప్పటికీ క్షేత్రస్థాయిలో అది పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని యూనియన్ నాయకులు తెలిపారు. దీంతో ఆర్టిజన్లు, జేఎల్ఎం సిబ్బందిపై అదనపు భారం పడుతోందని పేర్కొన్నారు. ఒక్కో సిబ్బంది 3,000 నుంచి 4,500 వరకు సర్వీసులకు బిల్లింగ్ చేయాల్సి వస్తుండటంతో నిర్ణీత సమయంలో పని పూర్తి చేయడం కష్టంగా మారిందన్నారు. రాజేంద్రనగర్ డివిజన్‌లోని పలు సెక్షన్లలో ఎఫ్ఓసీ సిబ్బంది లేకపోవడంతో అత్యవసర విద్యుత్ సేవల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి సెక్షన్‌కు వాహనం మంజూరైనప్పటికీ సిబ్బంది లేరని, కిస్మత్‌పూర్, శాస్త్రిపురం సెక్షన్లు ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఎఫ్ఓసీ సిబ్బంది మంజూరు కాలేదని పేర్కొన్నారు. అలాగే స్పాట్ బిల్లింగ్ పనులు నిర్వహిస్తున్న బిల్లర్లు 12 రోజులపాటు విధులు నిర్వహించినప్పటికీ గత మూడు నెలలుగా వారికి జీతాలు అందలేదని యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది కొరతతో పాటు వేతనాల సమస్యను కూడా వెంటనే పరిష్కరించాలని కోరారు. విద్యుత్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి అవసరమైన సిబ్బందిని నియమించడంతో పాటు వాహనాలు, ఎఫ్ఓసీ సిబ్బంది, స్పాట్ బిల్లింగ్, పెండింగ్ వేతనాల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ సర్కిల్ అధ్యక్షుడు కావలి ఆంజనేయులు, సర్కిల్ కార్యదర్శి ఎ. కిరణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.